AL - HILAL

నెలవంక



Vol 7, Issue: 49 November - 2010 مجلة الهلال (باللغة التلغوية) - ملحق مجلة البشرى

హాజరయ్యాము ప్రభూ! మేము హాజరయ్యాము

క్యూనున్ మెుఖీ ఈజ్ ఐ హార్స్



IPC
لجنة التعريف بالإسلام
ISLAM PRESENTATION COMMITTEE
جمعية النجاة الخيرية

ఉచితం

telgo.indd 1 10/26/10 10:38 AM

మీరు నాటే విత్తనం గురించి ఎప్పుడైనా ఆలోచించారా? ఆ విత్తనాన్ని మొలపించటానికి నేల గుండెను చీల్చి, దాన్నుండి ఒక మహా వృక్ష సృజన ప్రారంభించింది ఎవరు?



మీరు పీల్చే గాలిని గురించి ఎప్పుడైనా యోచించారా? దానిని మీకు ప్రయోజనకరంగా చేసిందెవరు?



◈ భూమిని పాన్పులా పరచిందెవరు? ఆకాశాన్ని కప్పుగా నిలబెట్టింది ఎవరు? సూర్యుడిని తూర్పు నుండి ఉదయింపజేసి, పడమరన అస్తమింపజేస్తున్నది ఎవరు? చంద్రునికి చల్లదనాన్ని, సముద్రానికి అగాధాన్ని, అవనికి సహనాన్ని, ఆకాశానికి ఉత్థానాన్ని అనుగ్ర హించిందెవరు?

విస్ఫోటనమా??
విగ్రహమా???
మానవుడా????
దేవుడా ??????


మీకు ప్రాప్తమయి ఉన్న బుద్ధివివేకాలకు పదును పెట్టి ప్రశాంత చిత్తంతో ఆలోచించండి! నిజ దైవమెవరో గర్తెరిగి జీవించండి!!

మీరు త్రాగే మంచి నీరు గురించి ఎన్నడైనా యోచించారా? దాన్ని మేఘాల నుంచి కురిపిస్తున్నది ఎవరు?





పోనీ, మీరు మండించే ఈ నిప్పును గురించి ఎప్పుడైనా కాస్త ఆలోచించారా? దానికి ఉపయోగపడుతున్న చెట్లను సృష్టించిందెవరు?



నెలవంక

(AL-HILAL MONTHLY)

Vol 7, ISSUE: 49
November 2010

CHIEF PATRON
Muhammad Ismail Ansari

GENERAL SUPERVISION
Khalid Al-Sab'a

EDITOR
Syed Abdus Salam Omeri

EDITORIAL BOARD
Sk. Habeebur Rahman Jamaee
Sk. Abdus Salam Omeri
Sk. Muhammad Bilal
Tahera Begum

PHONE
Syed Abdus Salam Omeri
97248933

FAX
22400057

P.O.BOX: 1613
SAFAT-13017, KUWAIT

PUBLISHED BY
IPC
Islam Presentation Committee
Kuwait
www.ipc-kw.com

DESIGN
Nader Belal

مؤسسة زخرف للدعاية والإعلان
Zukhruf Advertising Agency
www.zukhruf.net
Tel. 99993072

ఈ సంచికలో....

త్యాగం లేనిదే... 2
ఆలస్యం అమృతం విషం 3
హ్యూమన్ మెమరీ... 4
త్యాగమూర్తి ఇబ్రాహీమ్ (అ) 6
మూర్తీభవించిన సత్యం... 10
ధర్మ సందేహాలు 11
ఇస్లాం శిక్షణ 12
కవితా కుసుమాలు 13
మానవత సమైక్యతకు... 14
ఐపిసి వార్తలు 16
షిర్క్ పుట్టుపూర్వోత్తరాలు 18
నేటి బాలలే రేపటి పౌరులు 19
నెలవంక ఉత్తరాలు 20



الإيثار روح المجتمع ◀تَعَجَّلُوا إِلَى الْحَجِّ◀قضية مسجد بابري ◀سيرة سيدنا إبراهيم عليه السلام ◀مصدق لما بين يديه ◀الفتاوى الشرعية ◀خذ عقيدتك من القرآن والسنة ◀نشيد عن فضائل الحج ومكة ◀الإتحاد الإنساني في الصلاة ◀أخبار اللجنة ◀خلفية الشرك ◀روضة الأطفال ◀رسائل الهلال

telgo.indd 3 10/26/10 10:38 AM



త్యాగం లేకుండా ఏ ఆశయమూ సిద్ధించదు



ఎన్.ఎమ్.మలిక్
smmallick@hotmail.com

త్యాగం సామాజిక జీవనానికి జీవనాడి. సమాజం సజావుగా సాగాలంటే సభ్యుల్లో త్యాగశీలం అనివార్యం.

త్యాగం - తనువులో చూపాలి. మనసులో చూపాలి. ధనంలో చూపాలి. సమయంలో చూపాలి. శక్తిలో చూపాలి. త్యాగం తన కోసం చెయ్యాలి. తనవారి కోసం చేయాలి. పరాయి వారి కోసమూ చెయ్యాలి. త్యాగం - ఆశయాల కోసం చెయ్యాలి. ఆదర్శాల కోసం చెయ్యాలి. తత్సమయ లక్ష్యాల కోసం చెయ్యాలి. చిరకాల సాఫల్యాల కోసం చెయ్యాలి. తాత్కాలిక గమ్యాల కోసం, శాశ్వత మార్గాల కోసం - జీవితమంతా త్యాగాల తోరణాలు నిండితే అందులో పండు వెన్నెల పండుతుంది. గుండెనిండా నెమ్మది నిండుతుంది. అందుకే సమాజం త్యాగాలను కోరుతుంది.

త్యాగం లేనిదే సమాజంలో అనురాగమూ లేదు, అనురక్తీ లేదు. మనుగడలో మమతలు పెరగాలంటే ప్రతి వ్యక్తీ ఎదుటివారి కోసం ఏదో ఒకటి త్యాగం చెయ్యవలసి వస్తుంది - కోరికల్ని త్యాగం చెయ్యవలసి వస్తుంది. కాంక్షల్నీ త్యజించవలసి వస్తుంది. మనసయిన మార్గాలనూ వదులు కోవలసి వస్తుంది.

త్యాగం లేనిదే ఏ ఆశయమూ సిద్ధించదు. ఆశయం ఎంత ఉన్నతమైనదో త్యాగాలూ అంతే విస్తృతమయి ఉంటాయి. ఆశయం ఎంత పవిత్రమయిందో త్యాగాలు అంతే నిష్ఠను, చిత్తశుద్ధిని కోరుతాయి.

ముస్లింల జీవితాశయం - ఒక్క మాటలో చెప్పాలంటే - భూమిలో విభుని మాటే చెల్లాలి అన్నది. దాని వివరణ: మనిషి తన వ్యక్తిగత జీవితంలోనూ అడుగడుగునా, క్షణక్షణాన సృష్టికర్త ఆదేశాలనే పాటించాలి. అతని సామూహిక జీవితంలోనూ అన్ని రంగాల్లోనూ ఎల్లెడలా ఆ పరమ ప్రభువు ఇచ్చే నెరవేరాలి. ఈ ఆశయానికి ప్రతి ముస్లిం వ్యక్తిగతంగానూ, ముస్లింల సమాజం సామూహికంగానూ బాధ్యత వహించవలసి ఉంటుంది. అయితే విశ్వ ప్రభువు అభీష్టం ఏమిటి?

చెడు సమసిపోవాలి. మంచి పరిఢవిల్లాలి! వ్యక్తిలోనూ, సమాజంలోనూ!!

ఈ ఆశయసిద్ధి కోసమే ముస్లిం జీవితమంతా కృషి చేస్తుంటాడు. పోరాడుతుంటాడు. అతని పోరాటం దుష్ట శక్తులతో, మిథ్యావాదాలతో, వినాశకర దృక్పథాలతో నిరంతరం సాగుతూ ఉంటుంది.

ఈ సంఘర్షణకు, చెడుతో జరిగే ఈ పోరాటానికి సమాయత్త పరచడానికి ఉద్దేశించబడినవే - ఇస్లాం ప్రతిపాదించే సకల ఆరాధనలు సకల ఉపాసనా రీతులు, నైతిక వ్యవస్థ, సామాజిక విధానం, రాజకీయ సిద్ధాంతం - ఇస్లామీయ జీవన వ్యవస్థ అంతా ఈ తర్ఫీదుకు దోహదపడేదే.

ఆ తర్ఫీదు, సుశిక్షణల అంతర్భాగమే "హజ్జ్" యాత్ర కూడా. అందులో మనిషి ఆంతర్యంలో ఉద్భవించే కాంక్షల్ని, వాంఛల్ని మాత్రమే కాక సకల దౌర్బల్యాలను జయించాలని హజ్ శిక్షణ ఇస్తుంది. శిక్షణలో అంతర్భాగంగానే మనిషి మోహావేశాలన్నింటికీ, రుచులన్నింటికీ దూరం కావాలని నిర్దేశిస్తుంది దైవాదేశం:

"హజ్ నెలలు అందరికీ తెలిసినవే. ఈ నిర్ణీత మాసాల్లో హజ్ సంకల్పం చేసుకున్న వ్యక్తి అప్రమత్తుడయి మెలగాలి. హజ్ కాలంలో అతను ఏ విధమయిన కామ చేష్టకు, పాపపు పనికి, పోట్లాటకు పాల్పడకుండా జాగ్రత్త పడాలి. మీరు చేసే సత్కార్యం ఏదయినా అది అల్లాహ్‌కు తెలుస్తుంది. హజ్ యాత్రకు ప్రయాణ సామగ్రిని తీసుకు మరీ బయలుదేరండి. అన్నింటికంటే ఉత్తమమయిన ప్రయాణ సామగ్రి నిష్కాగరిష్ఠత. కాబట్టి వివేచనాపరులారా, నా పట్ల అవిధేయత నుండి తప్పుకు మెలగండి".

(2: 197)

(టిఐపి వారి 'వెన్నెల తెరలు' పుస్తకం నుండి)

telgo.indd 4 10/26/10 10:38 AM



ఆలస్యం అమృతం విషం

తాహెరా బేగం

"ప్రప్రథమంగా మానవుల కొరకు నిర్మించబడిన ఆరాధనా గృహం నిస్సందేహంగా మక్కాలో ఉన్నదే. దానికి సకల శుభాలు ప్రసాదించబడ్డాయి. విశ్వ ప్రజలందరికి అది మార్గదర్శక కేంద్రంగా రూపొందించబడింది. దానిలో స్పష్టమైన సూచనలు ఉన్నాయి. ఇబ్రాహీం యొక్క ప్రార్థనా స్థలం ఉన్నది. దానిలో ప్రవేశించినవాడు రక్షణ పొందుతాడు. ప్రజలపై అల్లాహ్‌కు ఉన్న హక్కు ఏమిటంటే, ఈ గృహానికి వెళ్ళే శక్తిగలవారు దాని హజ్‌ను విధిగా చేయాలి. ఈ ఆజ్ఞను పాలించటానికి తిరస్కరించేవాడు అల్లాహ్‌కు ప్రపంచ ప్రజల అవసరం ఎంత మాత్రం లేదు అని స్పష్టంగా తెలుసుకోవాలి." (ఆలి ఇమ్రాన్: 96,97)

పై ఆయతులో పరిశుద్ధుడైన అల్లాహ్ కాబా గృహాన్ని మానవులందరి కొరకు ఆరాధనా కేంద్రంగా నిర్మించబడిన ఏకైక గృహమని పేర్కొన్నాడు. ఈ గృహం ప్రపంచంలోని 150 దేశాలలో నివసించే ముస్లింల పుణ్యక్షేత్రం. ప్రతి సంవత్సరం దాదాపు రెండు కోట్ల మంది ముస్లింలకు 15 రోజులుగా ఆతిథ్యాన్నిచ్చే అపురూప నెలవు.

"ఈ గృహం లాంటి ఒక గృహం 'బైతుల్ మామూర్' – అది ఏడు ఆకాశాలపైన దైవ దూతలకు ఆరాధనా కేంద్రంగా ఉంది. ప్రతిరోజు 70 వేల మంది దూతలు ఆ గృహం చుట్టు ప్రదక్షిణ చేస్తూంటారు. ఒకసారి ప్రదక్షిణాభాగ్యం పొందిన దైవదూతకు మరొక సారి ప్రదక్షిణ చేసే అవకాశం ప్రళయం వరకూ లభించదు" అని స్వయంగా దైవ ప్రవక్త ముహమ్మద్ (స) చెప్పి ఉన్నారు. (బుఖారీ, ముస్లిం)

దాని స్థానే భూమిపై ఒక ఆరాధనా కేంద్రాన్ని విశ్వ జనుల కొరకు నిర్మించమని అల్లాహ్ సుబ్‌హానహు వ తఆలా తన విధేయుడైన ఇబ్రాహీం (అ)కు ఆజ్ఞాపించాడు. ఇబ్రాహీం (అ), అల్లాహ్ ఆజ్ఞ మరియు దూత జిబ్రయీల్ గారి సూచనాను సారం తన కుమారుడు ఇస్మాయీల్ (అ)తో కలిసి కాబా గృహాన్ని భక్తిప్రపత్తులతో నిర్మించి, దానికి ఎల్లలను సూచించారు. కాబా నిర్మాణానంతరం **"వ అజ్జిన్ ఫిన్నాసి బిల్‌హజ్జ్"** అన్న ప్రభువాజ్ఞ ప్రకారం ప్రజలకు కాబా గృహంవైపు హజ్ కొరకు రమ్మని పిలుపునిచ్చిన ప్రథమ ప్రవక్త ఇబ్రాహీం (అ). ఈ గృహ విశిష్టత గురించి ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా తెలియపరచారు:

"హజ్ ఉమ్రాకు వెళ్ళేవారు దేవుని ముఖ్య అతిథులు, వారు అల్లాహ్‌ను వేడుకుంటే అల్లాహ్ వారి మొరలను స్వీకరిస్తాడు, క్షమాభిక్షను అర్థిస్తే క్షమిస్తాడు. చిత్తశుద్ధితో చేసిన హజ్‌కు ప్రతిఫలం స్వర్గంకంటే తక్కువ కాజాలదు. మనో వాంఛలకు, చెడు పనులకు దూరంగా ఉంటూ దైవప్రసన్నత కోసం హజ్ చేసిన వ్యక్తి, ఆ రోజే తల్లి గర్భం నుంచి పుట్టిన శిశువు వలె అత్యంత పునీతుడయి తిరిగి వస్తాడు. మస్జిదె హరామ్‌లో చేసే ఒక నమాజుకు ఇతర మస్జిద్‌లలో చేసే లక్ష నమాజుల పుణ్యం ప్రసాదించబడుతుంది" అని మహా ప్రవక్త ముహమ్మద్ (స) వారి మరికొన్ని ప్రవచనాల ద్వారా రూఢీ అవుతుంది.

ఇవేకాకుండా ప్రాపంచిక శుభాలు కూడా ఎన్నో ప్రాప్తమవుతాయి. వాటిలో సర్వ శ్రేష్ఠమైనది విశ్వ మానవ విశ్వాస బాంధవ్యం. ప్రపంచ దేశాల్లోని ముస్లిముల వేష భాషలు, అలవాట్లు వేరైనా, 15 రోజుల పాటు సకల ఉపాసనారీతులు ఎలాంటి విభేదం లేకుండా కలిసిమెలిసి పాటిస్తారు. వారందరి ధ్యేయం ఒక్కటే అయి ఉంటుంది. అల్లాహ్ ప్రసన్నత, పరలోక సాఫల్యం, క్షమాభిక్ష.

అక్కడ వాగ్వివాదాలకు తావు లేదు. పోట్లాటలకు ఆస్కారం ఉండదు. అందరి అధరాలపై కదలాడే సంకీర్తనం ఒకటే– **"హాజరయ్యాను ఓ అల్లాహ్ నేను హాజరయ్యాను, సాటి లేని స్వామీ నేను హాజరయ్యాను. నిస్సందేహంగా సకల స్తోత్రాలు నీకే. సకల వరాలు అనుగ్రహించినదీ నీవే. సార్వభౌమత్వమూ నీదే. నీకు సమానులు, సహవర్తులు ఎవ్వరూ లేరు."**

అక్కడకు చేరిన ప్రతి ప్రాణికి రక్షణ ఉంది. రాజైనా, పేదయినా సమయానికి అల్లాహు అక్బర్ అన్న పిలుపుకు సమానంగా స్పందించి, ప్రతిష్ఠాలయానికి తరలి వచ్చి, కలిసి మరీ నమాజు చేస్తారు. అలాంటి శుభ వాతావరణంలో ఒక్క రోజు జీవించినా వారి జన్మ ధన్యమే.

ఈ గృహంలోని స్పష్టమైన సూచనలు అనగా, ఇబ్రాహీమ్ (అ) జీవితంతో ముడిపడి ఉన్న ప్రతి ఒక్క ఘట్టానికి ప్రతిరూపంగా ఉన్న అక్కడి 'మషాయిర్'. మనిషి జాడ కానరాని ఎడారిలో అల్లాహ్ ఆరాధనకై ఇబ్రాహీం (అ) నిలబడి కాబా గృహాన్ని నిర్మించిన ఆ స్థలమే మఖామె ఇబ్రాహీమ్. జీవిత సౌకర్యాలూ, జన సంచారం లేని ప్రదేశంలో తన ఏకైక పుత్రునితో, భర్త విధేయత, మరియు అల్లాహ్ ఆజ్ఞాపాలనకై అక్కడ జీవించడానికి సిద్ధపడిన ఒక విశ్వాసురాలి నిరుపమాన విశ్వాసానికి, ధైర్యానికి, ఆత్మ స్థయిర్యానికి నిదర్శనం జమ్ జమ్ జల నిధి, సఫా మర్వాల సయీ. హుర్ర్ మైదానాన్ని, లెక్కల ఘడియని తలపించే అరఫాత్ మైదానం, మినా, ముజ్దలిఫాలు – ఇవన్నీ కాలచక్రంలో నాలుగు వేల సంవత్సరాలుగా తమ పూర్వ వైభవంతో అలరారుతూ వస్తున్న హజ్ 'చిహ్నాలు'.

అందుకే – ఆరోగ్య, ఆర్థిక స్తోమత కలిగి ఉన్న ప్రతి ముస్లిం తప్పనిసరిగా హజ్ చేయాలనీ, చేయక తిరస్కరించిన వారికి– అల్లాహ్‌కు మధ్య ఏ సంబంధం ఉండదని హెచ్చరించాడు అల్లాహ్.

ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా అన్నారు: **"వీలైనంత త్వరగా హజ్ చేసుకోండి. ఎవరికి ఎప్పుడు ఏ ఆటంకం ఏర్పడుతుందో ఎవరికీ తెలియదు. తాను హజ్ చేయాలి అని అనుకునే వ్యక్తి దాని కోసం తొందరపడాలి. ఆలస్యం చేస్తే అతను వ్యాధి బారినయినా పడవచ్చు లేదా తన వాహనాన్ని అయినా పోగొట్టుకోవచ్చు. లేదా ఇంకా ఏదయినా ఆటంకం ఏర్పడవచ్చు."**

telgo.indd 5 10/26/10 10:38 AM

ముహమ్మద్ అజీజుర్రహ్మాన్



క్యామన్ వెల్త్ గేమ్స్ టూ షార్ట్

"బాబరీ మస్జిద్/ రామ జన్మ భూమి యాజమాన్య హక్కులపై అలహాబాద్ హైకోర్టు ఇవ్వబోయే తీర్పును మీరు శిరసావహిస్తారా?" అని ప్రశ్నించినప్పుడు హిందూ మత సంస్థల నాయకులైనా, ముస్లిం సంస్థల నాయకులైనా ఇచ్చిన సమాధానం ఒక్కటే - "మేము న్యాయ స్థానం తీర్పును గౌరవిస్తాం. ఎలాంటి ఆవేశాలు ప్రదర్శించకుండా, అరాచకం సృష్టించకుండా నిగ్రహం పాటిస్తాం. తీర్పు మాకు అనుకూలంగా ఉంటే సరి. లేకుంటే న్యాయం కోసం సుప్రీం కోర్టును ఆశ్రయిస్తాం".

దాదాపు అందరూ అన్న మాటకు కట్టుబడ్డారు. అశాంతి అలజడులు సృష్టించకుండా దేశ గౌరవాన్ని నిల బెట్టారు. ముఖ్యంగా కామన్‌వెల్త్ క్రీడల నేపథ్యంలో, అమెరికా అధ్యక్షుడు భారత దేశాన్ని సందర్శించబోతున్న తరుణంలో నూరుకోట్ల మంది భారతీయులు ప్రదర్శించిన సంయమనానికి, సహిష్ణుతా భావానికి జోహార్లు అర్పించవలసిందే, ఎవరూ కాదనరు.

కాని -

ఏలిన వారు మాట నిలుపుకున్నారా?

నూరు కోట్ల మంది భారతీయులను ఏలే పరి పాలకులు జాతి ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టు కున్నారా? 18 కోట్ల మంది భారత అల్ప సంఖ్యాక వర్గాల గుండెలకు అయిన గాయాన్ని మాన్పించ టానికి తమ వంతుగా తీసుకున్న చర్య ఏమిటి? కనీసం ఆ బాధిత వర్గంలో నెలకొన్న అభద్రతా భావాన్ని దూరం చేయగలుగుతున్నారా? లాంటి ప్రశ్నలు ఈ సందర్భంగా జనించకుండా ఉండవు.

సెప్టెంబర్ 30న అయోధ్య వివాదాస్పద స్థలంపై అలహాబాదు హైకోర్టు లక్నో బెంచ్ ఇచ్చిన తీర్పు 'మెజారిటీ ఒపీని యన్'కి అద్దం పట్టేదిగా ఉంది. తీర్పుపై ముగ్గురు న్యాయమూర్తుల వ్యాఖ్యలు కూడా మూడు రూట్లలో ఉన్నాయి. వివాదాస్పద స్థలాన్ని మూడు భాగాలుగా విభజించి రెండు భాగాలను హిందూ వర్గాలకు, ఒక భాగాన్ని ముస్లిం వర్గానికి కేటాయించారు. 'సింహ భాగం' మాత్రం హిందువులదే అన్నారు.



న్యాయవాదులు కోర్టు ప్రాంగణంలోనే ఆనందంతో ఉబ్బితబ్బిబ్బవుతూ 'వి' సైగలు చేస్తూ తమ ఉద్దేశాన్ని చాటుకున్నారు. 'ముస్లిం పర్సనల్ లా బోర్డు' మాత్రం తాను ముందుగా అభిప్రాయపడినట్లు సుప్రీం కోర్టును ఆశ్రయిస్తానని ప్రకటించింది.

ఆంగ్లేయుల కాలం నుండే కోర్టులో నానుతున్న బాబరీ మస్జిద్ వ్యవహారం భారత దేశంలో శాంతి భద్రతలకు, మత సామరస్యానికి గొడ్డలిపెట్టుగా పరిణ మించింది. అధిక సంఖ్యాక వర్గం అయిన హిందువులు దీనిని ఒక ప్రతిష్ఠాత్మకమైన సమస్యగా తీసుకుంటే, అల్ప సంఖ్యాక వర్గీయులైన ముస్లింలు దీనిని తమ అస్థిత్వంతో ముడిపడివున్న అంశంగా పరిగణించారు. అగ్నికి వాయువు తోడైనట్లు రాజకీయ ప్రయోజ నాలు కూడా తోడై ఈ సమస్యను మరింత జఠిలం చేశాయి.

పూర్వాపరాలు

ఆంగ్లేయుల కాలం నుండే ఈ కేసు న్యాయ స్థానంలో ఉన్నప్పటికీ భారత ప్రజలు దీనిని అంత సీరియస్‌గా తీసుకోలేదు. 1949లో మస్జిద్ లోపల విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు మొదలు పెట్టడంతో బాబరీ మస్జిదుకు తాళం వేయమని స్థానిక కోర్టు ఆదేశిం చింది. అయితే రాజీవ్ గాంధి భారత ప్రధానిగా ఉన్న కాలంలో - 1986 జనవరి 31న ఉమేష్ చంద్ర పాండే అనే వ్యక్తి బాబరీ మస్జిద్ తాళాలు తెరవాలని దాఖలు చేసిన పిటిషన్‌ను పురస్కరించు కుని ఫైజాబాద్ జిల్లా కోర్టు జడ్జి ఆదరా బాదరాగా - 24 గంటలైనా గడవక ముందే ఫిబ్రవరి 1న-తాళాలు తెరవాలని ఆదేశిం చారు. ఈ వ్యవహారంపైన ముహమ్మద్

telgo.indd 6 10/26/10 10:38 AM

హాషిమ్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌ను పట్టించుకో కుండా - కొట్టి పారేశారు. పైగా ఈ తతంగానికంతటికీ ప్రధాని రాజీవ్ గాంధీ అండగా నిలిచారు. ఆ రోజు నుంచే అయోధ్య ఓ పెద్ద అగ్ని పర్వతంగా మారింది. భారీ ఎత్తున రామ మందిర నిర్మాణానికి వ్యూహరచన మొదలయింది. ఆరెస్సెస్, బజరంగ్‌దళ్, హిందూ మహా సభ, విశ్వ హిందూ పరిషత్ వంటి హైందవ సంస్థలన్నీ ఒక్క త్రాటిపై కొచ్చాయి.

మాటకు కట్టుబడిన వి.పి.సింగ్

ఆరెస్సెస్ రాజకీయ అనుబంధ పార్టీ అయిన బిజెపి ఈ అంశాన్ని 'తురుపు ముక్క'గా వాడుకుంది. 1984లో శ్రీమతి ఇందిరా గాంధీ హత్యానంతరం జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో కేవలం రెండు స్థానాలకు కుదించుకుపోయిన బిజెపి 'రామ జన్మ భూమి' అంశంతో ఒక్క సారిగా బలవత్తరమైన రాజకీయ శక్తిగా ఎదిగింది. 1989 పార్లమెంటు ఎన్నికల్లో 85 స్థానాలు కైవసం చేసుకుని వి.పి. సింగ్ ప్రభుత్వాన్ని శాసించే స్థాయికి చేరు కుంది. మరోవైపు అస్తుబిస్తు మెజారిటీతో ప్రధానమంత్రి అయిన వి.పి.సింగ్‌ది బిజెపి దయాదాక్షిణ్యాలపై ఆధారపడ వలసిన దయనీయ స్థితి. అదే సమయంలో హిందూ మత సంస్థలు జన జాగరణ ఉద్యమాలు మొదలెట్టాయి. మరోవైపు నుంచి సాధువులు కూడా ఉద్యమిం చారు. ఫైర్ బ్రాండ్‌లైన ఉమా భారతి, సాధ్వి రితాంబర రంగ ప్రవేశం చేశారు. ఇంకో వైపు నుంచి (1990లో) అద్వానీజీ రథయాత్రను ప్రారంభించారు. అధికారాన్నయినా వదులుకుంటానుగాని బాబరీ మస్జిద్‌కి మాత్రం నష్టం జరగనివ్వనని ప్రధాని వి.పి.సింగ్ తెగేసి చెప్పారు. అప్పటి యు.పి, బిహార్ ముఖ్య మంత్రులైన ములాయం సింగ్ యాదవ్, లాలూ ప్రసాద్ యాదవ్‌లు కూడా ఈ మాటపైనే నిలబడ్డారు. ఫలితంగా బిహార్‌లోనే రథయాత్ర నిలువరించ బడింది. అయోధ్యలో సరయూ నదిని దాటి వచ్చి మస్జిద్‌పై దాడి చేసిన కరసేవ కులపై పోలీసులు కాల్పులు జరిపారు. కట్టడానికి పాక్షికంగా నష్టం కూడా జరిగింది. మొత్తమ్మీద వి.పి.సింగ్ తన మాటను నిలుపుకున్నారు గాని తన పదవిని నిలుపుకోలేకపోయారు.

(మిగతాది 16వ పేజీలో)

ఆనాడు భారత ప్రధాని శ్రీ పి.వి. నరసింహా రావు ఏమన్నారు?

"బాబరీ మస్జిద్ నేలమట్టం చేయ బడిందని తెలియజేయటానికి విచా రిస్తున్నాము. ఇది అత్యంత శోచ నీయమైన సంఘటన.... భారత జాతికే మాయని మచ్చ... సిగ్గుతో కుంచించుకుపోవలసిన విషయం. .. అదే స్థలంలో మస్జిద్ తిరిగి నిర్మించబడుతుంది. ఇందులో ఎలాంటి ద్వంద్వాభిప్రాయానికి తావు లేదు. దేశ ప్రజలంతా సంయ మనంతో వ్యవహరించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము."

ద్వితీయ ఖలీఫా దూరదృష్టి

సెక్యులరిజానికి సింబల్‌గా భారత దేశంలోని కొన్ని పట్టణాలలో స్థానిక హిందూ ముస్లింలు కలిసి ఒకే చోట - ప్రక్కప్రక్కనే - మస్జిద్, మందిర నిర్మాణాలు చేపట్టారు. అలాగే కొన్ని చోట్ల 'మందిరం, మస్జిద్, చర్చ్‌లు' నిర్మించబడ్డాయి. ఇది ఆయా ప్రజల సహృదయతకు, సామరస్యానికి ప్రతిబింబమే కావచ్చు. కాని రానురాను పరిస్థితుల్లో మార్పు వస్తుంది. తదుపరి కాలంలోని వారికి ఈ విషయం గుర్తుండకపోవచ్చు. గుర్తున్నా ఏదేని విషయంలో ఏర్పడిన మనస్పర్థని ఆసరాగా తీసుకుని ఒక వర్గం వారు తమ ఆరాధనాలయం ప్రక్కనే ఉన్న మరో ఆరాధనాలయానికి కీడు తలపెట్టవచ్చు. తత్కారణంగా 'సామరస్యం' స్థానే 'వైమనస్యం' పొడసూపవచ్చు. కాబట్టి ఆయా పట్టణాలలోని మత పెద్దలు ఈ విషయంలో జాగ్రత్త పడటమే మంచిది.

ద్వితీయ ఖలీఫా హజ్రత్ ఉమర్ (ర) విజేతగా జెరూసలేం నగర ప్రవేశం చేసినప్పుడు జరిగిన సంఘటన ఉదాహరణప్రాయం. అక్కడి చర్చ్ ప్రాంగణంలో ఖలీఫాకి - క్రైస్తవ మతాధిపతులకు మధ్య చర్చలు జరుగుతున్నాయి. అంతలోనే నమాజుకు వేళ అయ్యింది. ఖలీఫా ఉమర్ (ర) నమాజు కోసం వెళ్ళబోయారు. మీకు అభ్యంతరం లేదనుకుంటే ఇక్కడే నమాజ్ చేసుకోవచ్చని క్రైస్తవ మత పెద్దలు ఆఫర్ ఇచ్చారు. కాని ఖలీఫా ఉమర్ (ర) వారి ఆఫర్‌ని సున్నితంగా నిరాకరిస్తూ ఇలా అన్నారు: "ఈ రోజు నేనిక్కడ నమాజ్ చేసుకుంటాను. కాని తరువాతి కాలంలో నా అనుయాయులెవరైనా వచ్చి, 'ఇది మా ఖలీఫా నమాజు చేసిన స్థలం గనక మాకు స్వాధీనం చేయండి. మేమిక్కడ మస్జిద్ నిర్మిస్తాం' అని అనవచ్చు. ఇది ఉభయ వర్గాలకూ మంచిది కాదు". ధర్మ ఖలీఫా హజ్రత్ ఉమర్ (ర) దూరదృష్టికి, దార్శనికతకి ఇదొక మచ్చుతునక మాత్రమే.

telgo.indd 7 10/26/10 10:38 AM

మూలం:
షేఖ్ అబూ బకర్ నజ్జార్

తొలి గృహిణి

ప్రవక్త ఇబ్రాహీమ్ (అ)



ఇబ్రాహీమ్ (అ) దుఃఖం

తన కుటుంబాన్ని మదలి ఒక్కో అడుగు దూరంగా వెళుతున్న కొద్దీ ఇబ్రాహీమ్ (అ)కు దుఃఖం అతిశయించసాగింది. ముసలి వయసులో తనకు అల్లాహ్ ప్రసాదించిన ఏకైక కుమారుడిని అక్కడ వదలి వెళుతున్న ఆలోచన కూడా భరించ రానిదిగా ఉందాయనకు. అయితే విశ్వ ప్రభువు పట్ల దృఢమైన తన నిబద్ధతను నిరూపించుకునే పరీక్షల్లో ఇదొకటని ఆయన గుర్తించారు. ఆయన అల్లాహ్‌ను ప్రార్థిస్తూ, "ఓ ప్రభూ! నీ పవిత్రమైన గృహానికి దగ్గరగా నిర్జన ప్రదేశంలో నేను నా కుటుంబీకులను వదలి వచ్చాను. వారు అక్కడ దైవారాధనను స్థాపించాలని భావిస్తున్నాను. వారి పట్ల సానుభూతి, ఆదరాభిమానాలను ప్రజల్లో కలిగించు. వారికి కావలసిన సదుపాయాలు ప్రసాదించు" అని వేడుకున్నారు.

దేవునిపై భారం వేసిన హాజిరాకు విశ్వ ప్రభువు సహనాన్ని, ధైర్యాన్ని ప్రసాదించాడు. కొన్ని రోజులు గడిచిన తర్వాత వారి వద్ద ఉన్న ఆహారం, నీరు అయిపోయాయి. పసి బిడ్డతో సహా ఆమె ఆకలిదప్పులతో అలమటించసాగారు. బిడ్డకు పాలు పట్టడానికి ఆమె రొమ్ముల్లో పాలు కూడా రావడం లేదు. పసిబిడ్డ ఆకలితో దయనీయంగా ఏడుస్తున్నాడు. హాజిరా కన్నీరుమున్నీరయ్యింది. బిడ్డను అక్కడే నేల మీద వదలి నీటి కోసం, ఆహారం కోసం వెతుకాడుతూ తిరగ సాగారు. ఒక కొండను ఎక్కారు (ఈ కొండనే తర్వాత సఫా కొండగా పిలుస్తున్నారు). ఆ కొండపై నుంచి ఆ లోయల మొత్తాన్ని పరిశీలించి చూశారు. మరో వైపున ఇంకో కొండ కనబడింది (దీనిని తర్వాత మర్వా కొండగా పిలుస్తున్నారు). ఆ కొండపై నుంచి చూస్తూ నీటి జాడ కన బడుతుందన్న ఆశతో ఆ కొండపైకెక్కారు. కాని ఏమీ కనబడలేదు. ఆమె ఆందోళనతో మళ్ళీ మొదటి కొండపైకెక్కారు. ఆ విధంగా ఆమె నీటి కోసం వెదుకాడుతూ ఆ రెండు కొండల మధ్య ఏడుసార్లు పరుగులు తీశారు. (హజ్ యాత్ర సందర్భంగా సఫా మర్వా కొండల మధ్య ఏడుసార్లు పరుగెత్తుతూ చేసే 'సయీ' ఈ సంఘటన జ్ఞాపకార్థమే.)

జమ్‌జమ్

ఆమె నిరాశగా పసిబిడ్డ వద్దకు వచ్చారు. బిడ్డ పరిస్థితి దయనీయంగా ఉంది. "ఓ ప్రభూ! కరుణించు" అంటూ మొర పెట్టుకున్నారు. బిడ్డ పరిస్థితి క్షణక్షణానికి దిగజారుతోంది. ఊపిరి మందగిస్తోంది. శ్వాస కష్టమవుతోంది.

బాధాతప్త హృదయంతో, తన ఏకైక సంతానం కొన ఊపిరితో పెనుగులాడడాన్ని ఆమె నిస్సహాయంగా చూడసాగారు. ఎండిపోయిన బిడ్డ గొంతు నుంచి ఎలాంటి ధ్వని రావడం లేదు. కేవలం కాళ్ళు కొట్టుకుంటున్న శబ్దం మాత్రం వినిపిస్తోంది. పసిబిడ్డ ఇస్మాయీల్ తన చిన్నారి కాళ్ళతో నేలను కొడుతున్న ప్రదేశంలో స్వచ్ఛమైన నీటి ఊట అకస్మాత్తుగా ఉబికి వచ్చింది. ఆమె తన కళ్ళను తాను నమ్మలేక పోయారు.

అల్లాహ్ పట్ల ఆమె చూపిన విధేయత, ఆమె ప్రదర్శించిన సహనాలకు అత్యుత్తమ బహుమానం లభించింది. ఎండిపోయిన నేల నుంచి స్వచ్ఛమైన జలధార ఉబికి వచ్చేలా చేశాడాయన. తనకు నమ్మకస్తుడైన

telgo.indd 8 10/26/10 10:38 AM

స్నేహితుడు ఇబ్రాహీమ్ (అ) కుటుంబం కష్టాల నుంచి బయటపడే దారి చూపించాడు. హాజిరా ఆ స్వచ్ఛమైన నీటిని బిడ్డ నోటిలో పోశారు. ఆ నీటతో బిడ్డ ప్రాణాలు కుదుట పడటాన్ని ఆమె ఆనందంగా వీక్షించారు. కన్నీళ్ళతో ఆమె అల్లాహ్‌కు కృతజ్ఞతలు అర్పించారు. ఆ అద్భుతమైన జలధారలే "జమ్ జమ్" జలంగా ప్రసిద్ధికెక్కాయి. 4000 సంవత్సరాల క్రితం నాటి ఈ జలధార నేటికి కూడా నిరంతరం ప్రవహిస్తూనే ఉంది. లక్షలాది హజ్ యాత్రీకులకు అత్యంత ఆరోగ్యప్రదమైన నీటిని అందిస్తోంది. ఒకప్పుడు నిర్జనమైన ఆ ప్రదేశంలో జీవం తొణికిసలాడేలా చేసింది ఈ జమ్‌జమ్ జలమే.



మరిన్ని చిహ్నాలు

దూరదూర ప్రాంతాలకు చెందిన పక్షులు ఆ నీటిని చూసి దాహం తీర్చుకోవడానికి అక్కడ వాలడం ప్రారంభించాయి. యెమన్ నుంచి వస్తున్న ఒక అరబ్బు తెగ "జుర్‌హుమ్" (యెమన్ వాసులు నిజమైన అరబ్బులు అనబడుతారు. వారు మాట్లాడే అరబీ భాష చాలా ప్రామాణికమైనది.) దూరం నుంచి పక్షులు గుంపులుగా ఆ ప్రదేశం వైపునకు వెళ్ళడాన్ని గమనించారు. విచారించడానికి కొందరిని అక్కడికి పంపించారు. అక్కడికి వెళ్ళిన వారు అక్కడ నీటి వనరు ఉందని తెలిపారు. ఆ అరబ్బు తెగ ఆ ప్రదేశానికి వచ్చింది. ఆ నిర్జన ప్రదేశంలో మనుష్యుల్ని చూసి హాజిరా చాలా సంతోషించారు. తనకు, తన కుమారునికి అల్లాహ్ పరిరక్షణ లభించిందనడానికి సూచనగా ఆమె భావించారు. ఆ ప్రజల హృదయాల్లో అల్లాహ్ వారి పట్ల సానుభూతిని జనింపజేశాడు. ఆ ప్రదేశం వైపునకు వారు వచ్చేలా చేశాడు. ఆ విధంగా ఇబ్రాహీమ్ (అ) చేసిన ప్రార్థనను దేవుడు ఆమోదించాడు.

ఆ ప్రదేశంలో జమ్‌జమ్ నీటి ఊట బయటపడినందువల్ల యెమన్ నుంచి అక్కడకు వచ్చిన జుర్‌హుమ్ తెగ అక్కడ విడిది చేయడానికి, ఆ నీటిని వాడుకోవడానికి హాజిరా అనుమతి కోరారు. హాజిరా సంతోషంగా వారిని స్వాగతించారు. వారిని అతిథులుగా గౌరవించారు. వారిలో కొందరు తమ కుటుంబాలను అక్కడకు పిలిపించుకున్నారు. చాలా మంది ఆ ప్రదేశం (మక్కా)నే తమ శాశ్వత నివాసంగా మార్చుకున్నారు.

ఇబ్రాహీమ్ (అ) అభిలాష

నిర్మానుష్య ప్రదేశంలో తాను వదలి వచ్చిన తన భార్యాబిడ్డల గురించి ఇబ్రాహీమ్ (అ) ఎప్పుడూ చింతిస్తూ ఉండేవారు. అప్పుడప్పుడు ఆయన అక్కడికి వెళ్ళి వారిని చూసి వచ్చేవారు. తాను కోరిన విధంగా తన కుమారుడు పెద్ద వాడవ్వడాన్ని చూసి సంతృప్తి చెందేవారు. తన కుటుంబాన్ని ఆదుకున్న విశ్వప్రభువుకు కృతజ్ఞతలు అర్పించే వారు. తన కుటుంబానికి నిలువ నీడ కల్పించి, వారికి కావలసిన అన్నపానీయాలు ఏర్పాటు చేసిన అల్లాహ్‌కు ధన్యవాదాలు తెలుపుకునేవారు.

నిరుపమానమైన త్యాగం

ఇబ్రాహీమ్ (అ) జీవితం యావత్తు విశ్వప్రభువు పట్ల నిబద్ధతను, చెక్కు చెదరని విశ్వాసాన్ని ప్రకటించే పరీక్షల సంగమం. దేవుని పట్ల నమ్మకం కలిగి ఉన్నవారు ఎన్నడూ నిరాశ చెందరు. అల్లాహ్ ఆదేశాలను ఎన్నడూ ప్రశ్నించరు. అల్లాహ్ ఎల్లప్పుడూ చెడుపై మంచికి విజయాన్ని ప్రసాదిస్తాడని ప్రగాఢంగా విశ్వసిస్తారు. ఇస్మాయీల్ (అ) చిన్న పిల్లవానిగా ఉన్నప్పుడు అల్లాహ్ మరోసారి ఇబ్రాహీమ్ (అ)ను కఠినమైన పరీక్షకు గురి చేశాడు. ఒక కల ద్వారా ఇబ్రాహీమ్ (అ) తన ఏకైక కుమారుణ్ణి అల్లాహ్ కోసం జిబహ్ చేయాలని ఆదేశించడం జరిగింది.

(బైబిల్‌లో కూడా ఈ ప్రస్తావన ఉమది. అబ్రహంకు అతని ఏకైక పుత్రుడు, ఇస్సాక్‌ను బలి ఇవ్వాలని ఆదేశించడం జరిగిందని. కాని ఇస్సాక్ ఆయన ప్రథమ పుత్రుడు కాదు. ఇస్మాయీల్ (అ) ఆయన జేష్ఠ పుత్రుడు. అంటే ఈ ఆదేశం అందిన సమయంలో ఆయనకు ఉన్న ఏకైక పుత్రుడు ఇస్మాయీల్ (అ) మాత్రమే. ఇస్సాక్ ఆ తర్వాత చాలా సంవత్సరాలకు జన్మించారు. ఇస్మాయీల్ (ఆ అరబ్బు తెగల్లో కలిశారు. ఆయన సంతానంలో ప్రవక్త అరబీ (స) జన్మించారు. కాగా ఇస్సాక్ సంతానంలో ఇతర ప్రవక్తలు జన్మించారు. అందువల్లనే అరబ్బులు, ఇస్రాయీల్ (ప్రవక్త యాకూబ్ (అ)గారి) సంతానం సోదరులని చెప్పడం జరుగుతుంది.)

ఆత్మ విశ్వాసంతో ఇబ్రాహీమ్ (అ) మక్కాకు బయలు దేరారు. ఈ వార్తను తన కుమారునికి చెప్పడం ఆయనకు ఒక పరీక్ష వంటిదే. అయితే ఇస్మాయీల్ (అ) కూడా తండ్రికి తగిన కుమారులు. ఆయన అనితర సాధ్యమైన ధైర్యసాహసాలను ప్రదర్శించారు. దేవుని ఆదేశాన్ని అమలు చేయాలని ఆయన నిబ్బరంగా తన తండ్రికి చెప్పారు. "నాన్నా! మీకు ఆజ్ఞాపించబడినట్లు చేయండి. అల్లాహ్ కోరిన విధంగా నేను చేయడానికి సిద్ధంగా ఉన్నాను" అని బదులిచ్చారు. ఆయన తన దుస్తులు తొలగించారు. తల్లికి సలాము చెప్పాలని తండ్రిని కోరారు. తన గుర్తులుగా తన దుస్తులు తల్లికివ్వాలని చెప్పారు. తాను కాళ్ళు చేతులు కొట్టుకోవడం జరిగితే తన తండ్రికి బాధ కలుగుతుందన్న ఉద్దేశ్యంతో తన కాళ్ళను చేతులను కట్టేయాలని తండ్రిని కోరారు. ఇబ్రాహీమ్ (అ) తన కత్తికి పదును పెట్టారు. ఆ విధంగా ఇస్మాయీల్ (అ)కు మృత్యు బాధ లేకుండా ఉండాలని భావించారు.

telgo.indd 9 10/26/10 10:38 AM



కుమారుడిని గట్టిగా కౌగలించుకుని రోదించారు. తర్వాత ఇస్మాయిల్ (అ)ను పడుకోబెట్టి కాళ్ళు చేతులు కట్టేశారు. బాధాతప్త హృదయంతో కుమారుణ్ణి చివరిసారిగా చూసుకున్నారు. బరువెక్కిన హృదయంతో కత్తిని ఎత్తారు. ఇస్మాయిల్ (అ) గొంతుపై వేటు వేశారు. కాని ఆ కత్తి గొంతును కోయలేదు. తన తండ్రి తగినంత గట్టిగా కోయాలని తండ్రితో చెప్పారు. ఇబ్రాహీమ్ (అ)అలాగే చేశారు. అయినా ఆ కత్తి గొంతును కోయలేదు. ఇబ్రాహీమ్ (అ) ఆశ్చర్యపోయారు. తన బలహీనతను క్షమించవలసినదిగా ఆయన అల్లాహ్‌ను వేడుకున్నారు. అల్లాహ్ ఆయన వేడుకోలుకు బదులిచ్చాడు. "ఇబ్రాహీమ్ (అ)! నీవు నిజంగా కలను సార్థకం చేశావు. మేము నీ విధేయతకు బహు మానం ప్రసాదిస్తున్నాము" అన్నాడు. ఆ తండ్రీకొడుకులు దేవుని ఆదేశం శిరసా వహించడానికి క్షణం వెనుకాడలేదు. అల్లాహ్‌కు కావలసింది బలి కాదు. తన ఆదేశాల పట్ల వారు చూపిన నిబద్ధతనే ఆయన పరీక్షించాడు. తండ్రీ కొడుకులు దేవుని కారుణ్యం పట్ల కృతజ్ఞతలు అర్పించారు. ఇస్మాయిల్ (అ)కు బదులుగా జిబహ్ చెయ్యడానికి ఆ దగ్గరలోనే ఒక పెద్ద పొట్టేలు కనబడింది. అంతకు ముందు కోయడానికి మొండికేసిన కత్తి ఆ పొట్టేలు గొంతును ఒక్క వేటుకు కోసింది. ఈ సంఘటనను స్మరిస్తూ ప్రతి సంవత్సరం ఈదుల్ అజ్హా (ఖుర్బానీ పండుగ) సందర్భంగా ఖుర్బానీ ఇవ్వడం జరుగుతుంది.

ద్వారబంధాన్ని మార్చడం

ఇస్మాయిల్ (అ) ఒక అందమైన యువకునిగా ఎదిగారు. జుర్‌హుమ్ తెగ వారి వద్ద ఆయన అరబీ భాషను నేర్చుకున్నారు. ఈ తెగకు చెందిన అమ్మాయినే వివాహమాడారు. ఆయన చాలా ఆనందంగా జీవితాన్ని గడుపసాగారు. ఆయన జీవితంలో ఎదురైన ఒకే ఒక్క దుఃఖకరమైన సంఘటన ఆయనను అమితంగా ప్రేమించిన మాతృమూర్తి తనువు చాలించడం. ఇస్మాయిల్ (అ)ను కంటికి రెప్పలా సాకిన హాజిరా మరణించిన సంఘటన ఆయన్ను విపరీతంగా కలచి వేసింది.

ఇబ్రాహీమ్ (అ) అప్పుడప్పుడు వచ్చి కుమారుణ్ణి చూసి వెళ్ళేవారు. ఆ ఎడారిలో ఆయన కుమారుణ్ణి చూడడానికి అనేక రోజులు ప్రయాణం చేసి రావలసి వచ్చేది. ఒకసారి ఆయన వచ్చినప్పుడు ఇస్మాయిల్ (అ) ఇంట లేరు. ఆయన భార్య ఇంట ఉండటంతో ఆమెతో ఇబ్రాహీమ్ (అ) మాట్లాడారు. భర్త ఆరోగ్యం ఎలా ఉందని వాకబు చేశారు. అయితే ఆమె ఆయన చెప్పే విషయాలు ఏవీ వినకుండా తన భర్త గురించి ఫిర్యాదులు ప్రారంభించింది. తమ బీద స్థితి గురించి చెప్పుకొచ్చింది. వచ్చింది ఎవరని కూడా ఆమె అడగలేదు. కనీసం మంచి నీరన్నా అందించలేదు. అసహనం నిండిన స్త్రీని ఇబ్రాహీమ్ (అ) ఆమెలో చూశారు. అల్లాహ్ అనుగ్రహాలను గుర్తించే శక్తిలేని స్త్రీని చూశారు. ఆయన కనీసం తన ఒంటె నుంచి క్రిందికి కూడా దిగలేదు. ఆయన ఆమెతో, "నీ భర్తను అడిగానని చెప్పు... ఇంటి ద్వారబంధాన్ని మార్చడం మరచిపోవద్దని చెప్పు" అని వెళ్ళిపోయారు.



ఇస్మాయిల్ (అ) ఇంటికి వచ్చిన తర్వాత ఆమె జరిగింది ఆయనకు చెప్పింది. వచ్చిన వ్యక్తి ఎలాఉన్నారని ఇస్మాయిల్ (అ) ప్రశ్నించారు. ఆమె ఆ వ్యక్తి ఆకారాన్ని వర్ణించింది. ఆ వచ్చింది తన తండ్రి అని ఆయన చెప్పారు. ఆయన చెప్పిన మాటలకు అర్థాన్ని వివరిస్తూ, సరిగా లేని ద్వారబంధం ఇంటికి తగినది కాదనీ, దాని వల్ల మనిషికి ఎదురు దెబ్బలు తగలడమే కాదు, గాయాలు కూడా అవుతాయనీ, అదే విధంగా ఆమె తనకు తగిన భార్య కాదని అన్నారు.

కొంతకాలం తర్వాత ఇబ్రాహీమ్ (అ) తన కుమారుణ్ణి చూడటానికి మళ్ళీ వచ్చారు. అప్పుడు కూడా ఆయన కుమారుడు ఇంట లేరు. అయితే ఇంట మరో స్త్రీ ఉంది. ఆమె ఇస్మాయిల్ (అ) మళ్ళీ పెళ్ళాడిన స్త్రీ. ఆమె ఆయనకు నీరందించింది. భోజనం వడ్డించింది. ఆయన ఒంటె దిగి, ఆమెను ఆమె భర్త గురించి అడిగారు. తన భర్త వేటకు వెళ్ళారని ఆమె బదులిచ్చింది. ఆ కాలంలో ఎడారి జీవితం చాల కష్టంగా ఉండేది. ఆహారం కోసం వేటాడ్డానికి చాలా దూరం వెళ్ళవలసి వచ్చేది.

ఆమె తన భర్త గురించి చెబుతూ ఆయన చాలా కష్టపడి తమను పోషిస్తున్నారని ప్రశంసలతో ముంచెత్తింది. అల్లాహ్‌కు కృతజ్ఞతలు అర్పిస్తూ మాట్లాడింది. ఇబ్రాహీమ్ (అ) చాలా సంతోషించారు. ఇస్మాయిల్ (అ)కు తగిన భార్య లభించిందని ఆనందించారు. తాను ఎవరైనదీ ఆమెకు చెప్పలేదు. తాను ఒక స్నేహితుడిని అని మాత్రమే చెప్పారు. (ఆమె ఎలాంటి కోడలో తెలుసుకోవాలని ఆయన భావించారు. ఆమె గురించి తన అభిప్రాయాన్ని నర్మగర్భంగా ఒక సందేశ రూపంలో అందించి ఆమెను ఆశ్చర్య పరచాలని భావించారు.) అక్కడి నుంచి బయలుదేరుతూ ఆయన ఆమె చూపిన అతిథి మర్యాదలకు కృతజ్ఞతలు చెప్పారు. "నీ భర్త వచ్చిన తర్వాత నా సలాము చెప్పు. ఇప్పుడు ద్వారబంధం చక్కగా కుదిరిందని చెప్పు" అని వెళ్ళిపోయారు.

telgo.indd 10 10/26/10 10:38 AM


ఇస్మాయిల్ (అ) ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత ఆమె జరిగింది వివరించారు. వచ్చిన అతిథి ఎలా ఉన్నారని ఇస్మాయిల్ (అ) ప్రశ్నించారు. ఆమె వివరించిన తర్వాత ఇస్మాయిల్ (అ) నవ్వుతూ, వచ్చినది తన తండ్రి అనీ, ఆయన నిన్ను నాకు తగిన భార్యగా అభివర్ణించారనీ, నీతో కలిసి ఉండాలని, నిన్ను కాపాడాలని కోరారని వివరించారు. ఇస్మాయిల్ (అ) జీవితాంతం ఆమెతో కలిసి ఉన్నారు. ఆమె ద్వారా ఆయనకు సజ్జన సంతానం కలిగింది.

కాబా నిర్మాణం

ఇబ్రాహీమ్ (అ) తన కుమారుణ్ణి చూసి చాలా కాలమయ్యింది. ఈసారి ఆయన ఒక అతి ముఖ్యమైన పని చేయవలసి ఉంది. ప్రపంచంలో మొట్టమొదటి ఆరాధనాలయాన్ని పునర్నిర్మించ వలసిందిగా అల్లాహ్ ఆయన్ను ఆజ్ఞాపించాడు. మక్కా లోయలో ఈ ఆరాధనాలయం ప్రాచీన కాలంలో ఉండేది. ఇబ్రాహీమ్ (అ) మక్కా లోయకు వచ్చారు. అక్కడ జమ్‌జమ్ బావి వద్ద తన కుమారుడు ఇస్మాయిల్ (అ) బాణాలకు పదును పెడుతుండ టాన్ని చూశారు. తండ్రిని చూసి ఆయన అమితంగా సంతోషిం చారు. తండ్రీకొడుకులు ఆనందంతో కౌగిలించుకున్నారు. అల్లాహ్ తనకు కాబా గృహాన్ని నిర్మించమని ఆదేశించాడని ఇబ్రాహీమ్ (అ) కుమారునికి తెలియజేశారు. ఇస్మాయిల్ (అ) ఎల్లప్పుడూ తన ప్రభువు ఆదేశాలను అమలు చేయడానికి సిద్ధంగా ఉండేవారు. ఇరువురు కలసి కాబా గృహం పునాదులు తవ్వసాగారు. ఈ పని చేస్తున్నప్పుడు వారి నోట క్రింది పదాలు వారి హృదయాల్లోని భావాలను వ్యక్తం చేస్తూ వెలువడసాగాయి.

"ఓ ప్రభూ! మా యిద్దర్ని ముస్లింలుగా జేయి. మా సంతానంలో ముస్లిం జాతిని ఉద్భవింపజేయి. మా ప్రయత్నాల ఫలితాలను మాకు చూపించు. మా పశ్చాత్తాపాన్ని స్వీకరించు. నీవే పశ్చాత్తాపాన్ని స్వీకరించేవాడివి. అనంత కరుణామయుడివి".

(బఖరా:127,128)



ఇస్మాయిల్ (అ) రాళ్ళను మోసుకుని వస్తుంటే ఇబ్రాహీమ్ (అ) వాటిని అమర్చ సాగారు. కొంతకాలానికే నిర్మాణం రూపు రేఖలు దిద్దుకుంది. తమకు సహాయంగా ఎవరినీ వారు తీసుకోలేదు. గోడలు చాలా ఎత్తుకు లేచాయి. ఇప్పుడు రాళ్ళు పేర్చడానికి ఇబ్రాహీమ్ (అ)ఏదైనా ఎత్తు వేసుకోవలసిన అవసరం ఏర్పడింది. ఆయన ఇస్మాయిల్ (అ)తో ఏదైనా మంచి రాయి, తాను నిలబడటానికి చూడమని చెప్పారు. ఇస్మాయిల్ (అ) ఒక పెద్ద రాయిని అక్కడికి దొర్లించారు. (ఈ రాయి వేలాది సంవత్స రాలుగా పరిరక్షించబడుతున్నది. నేడు 'మఖామె ఇబ్రాహీమ్' అన్న పేరుతో గాజు పలకల మధ్య ఉన్న రాయి ఇదే.) ఆ విధంగా కాబా గృహం నిర్మించబడింది. మక్కాలో కాబా గృహం నిర్మించ బడినప్పటి నుంచి ప్రపంచ వ్యాప్త ముస్లింలకు (దైవ విధేయులకు) పవిత్ర గృహంగా అలరారుతోంది. విశ్వప్రభువైన అల్లాహ్ పట్ల తమ కృతజ్ఞతలను ముస్లింలు ఇక్కడికొచ్చి తెలియజేస్తుంటారు.

గ్రహించవలసిన పాఠాలు

- ఇబ్రాహీమ్ (అ)ను ప్రవక్తల పితామహునిగా పేర్కొనడం జరిగింది. సమాజంలో షిర్క్ (బహుదైవారాధన)ను దురాచా రాలను తుదముట్టించడానికి ఆయన నిరంతరం శ్రమించారు.
- ఇబ్రాహీమ్ (అ) తండ్రి అల్లాహ్ సందేశాన్ని తిరస్కరించి నప్పుడు ఆయన తన తండ్రిని నిందించలేదు. ఆయన సాఫల్యం కొరకు ప్రార్థించారు. ఆయనను సత్యసందేశం స్వీకరించేలా మార్చాలని ఆశించారు. తండ్రి పట్ల ఆయన గౌరవాదరణలతో వ్యవహరించారు. ఆయన పట్ల గౌరవమర్యాదల్లో లోటు చేయలేదు. ఇబ్రాహీమ్ (అ) అల్లాహ్ పట్ల పూర్తి విశ్వాసం కలిగి నవారు. ఎలాంటి త్యాగానికైనా వెనుదీయని వ్యక్తిత్వం ఆయనది. విశ్వప్రభువైన అల్లాహ్ ఆయన్ను "ఖలీలుల్లాహ్" (అల్లాహ్ మిత్రుడు)గా అభివర్ణించాడు.
- విగ్రహారాధకులను ఎదుర్కొన్నప్పుడు ఆయన అనితర సాధ్యమైన ధైర్యాన్ని ప్రదర్శించారు. వారు అత్యంత పవిత్రంగా భావిస్తున్న అంశాల్లోని ఔచిత్యాన్ని నిర్భయంగా ప్రశ్నించారు. మాటల వల్ల ఎలాంటి ప్రయోజనం లేనప్పుడు ఆయన తన నిరసనను చేతల్లో చూపించారు. విగ్రహాలను ధ్వంసం చేశారు. అందువల్ల ఆయన్ను అగ్ని గుండంలోకి విసిరివేయడం జరిగింది. కాని అల్లాహ్ పట్ల ఆయనకున్న చెక్కుచెదరని విశ్వాసం ఆయన్ను కాపాడింది.
- ఆయన భార్యలు సారా, హాజిరా ఇద్దరూ సౌశీల్యవతులు, ఆయన పట్ల పూర్తి విధేయత కలిగినవారు. సహనంతో వ్యవహరిస్తూ గొప్ప గొప్ప త్యాగాలు చేశారు. అందుగ్గాను అల్లాహ్ వారికి అనేక విధాల బహూకరించాడు.
- హాజిరా పట్ల, హాజిరా కుమారుని పట్ల ఇబ్రాహీమ్ (అ) గారి శ్రద్ధ చూసి సారా అసూయపడటం మానవ సహజమైన ప్రతిక్రియగా అర్థం చేసుకోవాలి.
- ఇబ్రాహీమ్ (అ) కుమారుడు ఇస్మాయిల్ (అ) తండ్రికి తగిన తనయుడు. తనకు తాను ప్రాణ త్యాగానికి సిద్ధమై అల్లాహ్ సంతుష్టిని పొందారాయన.
- అల్లాహ్‌కు మానవ బలి అవసరం లేదు. అల్లాహ్ కోసం కన్నకొడుకును జిబహ్ చేయడానికి సిద్ధపడడాన్ని, అల్లాహ్ సేవ కోసం కన్న కుమారుడిని అంకితం చేయడంగా మనం అర్థం చేసుకుని ఆచరణలో పెట్టగలం.
- వారు నిర్మించిన కాబా గృహం దేవుని ఏకత్వానికి చిహ్నంగా గత 4000 సంవత్సరాలుగా కొనసాగుతూ వస్తోంది.

telgo.indd 11 10/26/10 10:38 AM

సయ్యద్ అబ్దుస్సలాం ఉమ్రీ
abdussalamsyed@ymail.com

మూర్తీభవించిన సత్యం మహా ప్రవక్త ముహమ్మద్ (స)

అంతకు పూర్వం ఏ శతాబ్దిలోనూ సుదీర్ఘ ప్రపంచ చరిత్ర ఇన్ని మార్పులు చూడలేదు. లోకం మొత్తం కాంతి కానక, కటిక చీకట్లలో కొట్టుమిట్టాడుతున్న తరుణంలో మహా ప్రవక్త ముహమ్మద్ (స) జన్మించారు. నిఖిల జగతిలో విశ్వకర్త శాసనాన్ని అక్షరాలా పాటించే ఆదర్శ సమాజాన్ని నెలకొల్పి తనువు చాలించారు ఆయన. ఆయన హితోక్తుల శుభ జల్లుల వెల్లువలో మిథ్యాశక్తులన్నీ కొట్టుకుపోయాయి. సర్వత్రా ఏకేశ్వరోపాసనా నినాదాలు మారుమ్రోగాయి. దాస్య శృంఖలాలు మోయలేక ఒంగిపోయిన మానవ శిరస్సులు ధైర్యంతో శిఖరాలయి నిలిచాయి. బానిస సంకెళ్ళకు మూగబోయిన గొంతులు ఒక్కసారిగా స్వేచ్ఛా గీతాన్ని ఆలాపించాయి. నిస్సహాయులకు అండ లభించింది. అనాథలకు ఆశ్రయం దొరికింది. స్త్రీకి గౌరవం దక్కింది. బడుగు జీవులకు బలం చేకూరింది. ఆయన హితోక్తుల మహాస్త్రాల ధాటికి పైశాచిక హృదయాల పాచికలు మన్ను గరిచాయి. కుమతుల కుయుక్తులు ఎందుకూ కొరగాకుండా పోయాయి. సుమతుల్లో శాంతిశ్రేయాలు పరిఢవిల్లాయి. అది ప్రపంచ ఆయుధాగారంలోనే లేని సత్యతా కరవాలం. మనుషుల్ని కాదు, మనసుల్ని జయించడం దాని ప్రత్యేకత. ఇటువంటి అనన్య అద్భుత ప్రత్యేకతల చరిత్రే మహా ప్రవక్త ముహమ్మద్ (స) వారి చరితము.

మహా ప్రవక్త (స) సమస్త లోకాల పాలిట కరుణాఝరి. ఆయన ప్రజల మనిషి. ప్రజల కోసం జీవించిన మనిషి. ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యం తీసుకురావడానికి అవిరళ కృషి సలిపిన ఆదర్శమూర్తి. చివరి ఘడియల్లో సయితం 'ఉమ్మతీ, ఉమ్మతీ' - నా జనం నా జనం అంటూ పరితపించిన మానవ శ్రేయోభిలాషి, పరాత్పర వ్యక్తి ఆయన. అయితే ఇతర ప్రవక్తల్లా తన జాతి జనులను, దేశ ప్రజలను ప్రేమించడం, వారిలో చైతన్య బీజాలు నాటడం వరకే ఆయన పరిమితం అవ్వలేదు. ఆయన అంతిమ దైవ ప్రవక్త. సమస్త లోకాల పాలిట మూర్తీభవించిన దయా రూపం. సాత్విక ప్రేమ స్వరూపుడయిన ఆ మానవ మహోపకారి ఒక భాషకో, ప్రాంతానికో, జాతికో, దేశానికో పరిమితం ఎలా కాగలరు? జాతి అభిమానిగానో, విప్లవాత్మక సంస్కర్తగానో మాత్రమే ఆయన్ను భావి తరాల వారు తలచుకుంటారని చెప్పడానికి ఏ మాత్రం వీలు లేదు. క్రాంతకారుడైన ఆయన చేసిన ప్రబోధనం నిఖిల విశ్వానికి సంబంధించినది. ఆయన విశ్వనాయకుడు. విశ్వ జనులందరి కోసం ఆ విశ్వకర్త ప్రభవింపజేసిన ఋషిశ్రేష్ఠుడు. ఆయన కమనీయ జీవిత చరిత్ర నిఖిల మానవాళికి పఠనీయం.

కొందరు సంకుచిత స్వభావులు ఆయన్ను 'అరబ్బు ప్రవక్త'గా పేర్కొనడం వెనుక ఏ దురుద్దేశం దాగుందో తెలియదుగానీ; నిజానికి ఆయన స్థానం వారి అభూత కల్పనలకన్నా ఎంతో ఉన్నతమైనది. ఆయన దృష్టిలో మక్కా విజయం ప్రపంచ బానిస దేశాల విముక్తి సాధనలో ఒక భాగం మాత్రమే. శాశ్వత సత్యాలను ప్రజల జీవితాల్లో నిత్యం ప్రతిబింబింపజేసేందుకు ఆయన పడిన శ్రమ శ్లాఘనీయం. అందుకే ఆయన మూర్తీభవించిన సత్యం అయ్యారు. నైతిక సమగ్రతకు ప్రతి రూపంగా నిలిచారు. ఆయన ప్రవచనాలు జీవిత సత్యాలకు ఆనవాలు. అవి ఆయన విలక్షణమైన బుద్ధికీ, వినిర్మల శీలానికీ, ప్రవక్త పదవికి ప్రతీకలు. దివ్యగ్రంథాల క్షీరసాగరాన్ని మధించి తీసిన వెన్న ముద్దలు. అవి అరబ్బులకే కాదు, ఆంగ్లేయులకే కాదు, పారసీకులకే కాదు, భారతీయులకే కాదు, చైనీయులకే కాదు నిఖిల జగతికి ప్రాతఃపఠనీయాలు, ఆదర్శనీయాలు, ఆచరణీయాలు.

'వడ్డి ఇచ్చువాడొకడు తీసుకునింకొకడు, సాక్షిగా ఉంటడు మరియొక్కడు - ఈ మువ్వురూ శాపగ్రస్తులే' అని ధన స్వామ్య ధ్వజవాహకులపై దండెత్తిన ధీరోదాత్తుడు ఆయన (స). 'మనము బాటసారులము, కొన్నాళ్ళకు తిరిగి ఇంటికి చేరుట తథ్యము' అని ఐహిక జీవిత వాస్తవికతను ఎరుకపరచి మనిషిలో మానవత్వాన్ని నింపిన ధీర గంభీరుడు ఆయన (స). 'ఇన్నమల్ ఆమాలు బిన్నియాత్' - వికృత చిత్తవృత్తి నిరోధకము దైవ నామ స్మృతి (మనసును మైల కాకుండా కాపాడే రక్షక కవచం దైవ నామ స్మరణ). అది కంఠము నుండి కాదు ఎదలో పలికిన సద్గతి' అని అలవోకగా అర్థమయ్యేటట్లు చెప్పిన ప్రవక్త శిఖామణి ఆయన. 'సద్వచనం - లా ఇలాహ ఇల్లల్లాహ్' ఒక వంక, అనంత విశ్వాలు ఒక వంక నిలిపిన; సద్వచన పళ్ళమే వరణీయమౌతుంది' అని ఎలుగెత్తి చాటిన చల్లని చంద్రుడు ఆయన (స). 'సత్య ప్రియునికి నిందాస్తవములు తుల్యమ్ములు పొగిడిన అతడు రెచ్చిపోడు, తెగదిట్టిన ఉరిమి పడడు' అన్న మాటకి అక్షర రూపంగా నిలిచిన ఆదర్శప్రాయుడు ఆయన (స). ఆంతరంగిక నివాసమందు ఒకే కాలమ్మున ప్రతిష్ఠించ వీలు పడదు ప్రభువు భీతిని, ఐహిక ప్రీతిని' అని ఉద్బోధించిన ఉదయ భాస్కరుడు ఆయన (స). 'సకల అవ లక్షణాలకు మాతృక మత్తుపానీయం, మధుపానం కడు హేయం - అది చెడులన్నింటికి మూలం' అని మతుల తుప్పును వదలగొట్టిన మహితాత్ముడు ఆయన (స). 'శాంతిని సాధించ టానికి కలిమి, బలిమి సరిపోదు, అనురాగమున మించిన ఆయుధమ్ము వేరొకటి లేదు' అని నిరూపించిన శాంత వదనుడు ఆయన. 'నిరపేక్షత ధనంతో రాదు, తనలో విశ్వమును పొదిగిన వాడే సిసలైన సంపన్నుడు, నిరపేక్షాపరుడూను' అని 'సిరి' గురించి స్పష్టంగా వివరించిన ప్రవక్త శ్రీ ఆయన. 'కన్నొక్క తీరు, నోరొక్క తీరు, మనసింకొక్క తీరు వర్తించువాడే కపటి' అంటూ రెండు నాల్కల ధోరణిని నిరసించిన నిజ భక్తాగ్రేసరుడు ఆయన.



telgo.indd 12 10/26/10 10:38 AM

షేక్ అబ్దుల్ అజీజ్ బిన్ అబ్దుల్లాహ్ బిన్ బాజ్

మస్జిదె నబవీని సందర్శించని హజ్జ్ నాసిరకపు హజ్జ్‌గా మిగిలిపోతుందా?

ప్రశ్న: మస్జిదె నబవీ (ప్రవక్త మస్జిదు)ని సందర్శించనంతవరకు తమ హజ్జ్ నాసిరకపు హజ్జ్‌గానే పరిగణించబడుతుందని కొంత మంది హాజీలు భావిస్తున్నారు. ఇది ఎంతవరకు నిజం?

జవాబు: మస్జిదె నబవీ సందర్శన (జియారత్) సున్నత్, వాజిబ్ (తప్పనిసరి) కాదు. హజ్జ్ యాత్రలో, హజ్జ్ క్రియలలో ఇది అంతర్భాగం కూడా కాదు. కాకపోతే ప్రవక్త మస్జిదును సందర్శించటం అభిలషణీయం. ఏటేటా ఈ మస్జిద్‌ను దర్శించటం సున్నత్. అంతేగాని ఈ విషయాన్ని హజ్జ్ క్రియల (మనాసికె హజ్జ్)తో ముడిపెట్ట కూడదు. ఎందుకంటే ప్రవక్త మహనీయులు (స) ఇలా ప్రవచించారు:

"మూడు మస్జిద్‌లు తప్ప మరే స్థలానికీ "పుణ్యార్జన" (సందర్శన, మహత్మ్యం) ఉద్దేశ్యంతో ప్రయాణమవకూడదు – **1) మస్జిదె హరామ్ వైపునకు, 2) నా ఈ మస్జిద్ వైపునకు, 3) మస్జిదె అక్సా వైపునకు".** (ముత్తఫఖున్ అలైహి)

ఆయన (స) ఇంకా ఇలా అన్నారు: **"నా ఈ మస్జిద్‌లో చేసే ఒక నమాజ్ – మస్జిదె హరామ్ మినహా – వేరితరచోట్ల చేసే వేయి నమాజులకన్నా శ్రేష్ఠమైనది".** (ముత్తఫఖున్ అలైహి)

ఇకపోతే, ప్రవక్త మస్జిదును సమదర్శించినవారు మస్జిదులోని 'రియాజుల్ జన్నహ్' అనే స్థలంలో రెండు రకాతుల నఫిల్ నమాజు చేయటం నియమం. ఆ తరువాత దైవప్రవక్త (స)పై, ఆయన ప్రియ సహచరులైన అబూ బక్ర్, ఉమర్ (ర అన్‌హుమ్)లపై సలాం పఠించాలి. జన్నతుల్ బఖీని సందర్శించి, అక్కడ ఖననమై ఉన్న మహనీయులకు, తదితరులకు సలాం పంపినట్లే ఇది కూడా. ప్రవక్త మహనీయులు (స) సయితం సమాధులను సందర్శించినప్పుడు దుఆ చేసేవారు, ఈ విధంగా చేయమని తన సహవాసులకు నేర్పారాయన (స).

"అస్సలాము అలైకుమ్ అహ్లద్దియారి మినల్ మోమినీన్ వల్ ముస్లిమీన్ – వ ఇన్నా ఇన్షాఅల్లాహు బికుమ్ లాహిఖూన్ – నస్‌అలుల్లాహ లనా వలకుముల్ ఆఫియహ్".

(విశ్వాసుల, ముస్లింలకు చెందిన పరివార సదస్సులారా! మీకు శాంతి కలుగుగాక! దైవ చిత్తమైతే మేము కూడా మిమ్మల్ని కలుసుకుంటాము. మేము మా కోసం, మీ కోసం కూడా అల్లాహ్ నుండి క్షేమాన్ని అర్థిస్తున్నాము)

మస్జిదె నబవీని సందర్శించిన వారు మస్జిదె ఖుబాను కూడా దర్శించి, అక్కడ కూడా రెండు రకతుల నమాజు చేయటం నియమం. ఎందుకంటే దైవప్రవక్త (స) సాధారణంగా ప్రతి శనివారంనాడు మస్జిదె ఖుబాకు వెళ్ళి, రెండు రకాతుల నమాజు సలిపేవారు. ఆయన (స) ఇంకా ఇలా వక్కాణించారు: "ఎవరయినా తన ఇంట్లో చక్కగా తహారత్ చేసి, ఈ మస్జిద్ (మస్జిదె ఖుబా)కు వచ్చి అందులో రెండు రకాతులు నమాజ్ చేస్తే అది ఒక విధంగా ఉమ్రా (చేయటం) వంటిదే".

మదీనాలో సందర్శించవలసిన స్థలాలివే. మరికొన్ని స్థలాలను – ఉదాహరణకు:– ఏడు మస్జిద్‌లు, మస్జిదె ఖిబ్లతైన్, ఇంకా ఇలాంటి మరికొన్ని స్థలాల గురించి కూడా కొంత మంది రచయితలు పేర్కొంటూ, వాటిని ముఖ్యమైన క్రియలలో భాగంగా నొక్కి చెబుతుంటారు కాని దానికి మూలాలేమీ లేవు. విశ్వాసి అయినవాడు బిద్‌అత్ వాసన వచ్చే ప్రతి దానినీ వదలి పెట్టి సున్నత్ (పవక్త విధానము)ను అనుసరించాలి... సద్బుద్ధినిచ్చేవాడు అల్లాహ్ మాత్రమే.

తల్లిదండ్రుల తరఫున హజ్జ్ చేయాలని ఉంది

ప్రశ్న: నా పసితనంలోనే అమ్మ పోయింది. నేను ఒక వ్యక్తికి హజ్ ఖర్చులిచ్చి నా తల్లి తరఫున హజ్ చేయించాను. తరువాత నా తండ్రి కూడా మరణించారు. ఇప్పుడు నేను వారిద్దరి తరఫున హజ్ చేయటమో లేక ఎవరినయినా ఈ విధి నిర్వహణ కోసం నియమించటమో చేయాలనుకుంటున్నాను. ఈ రెండింటిలో ఏది సరైనది?

జవాబు: ఒకవేళ మీరే మీ తల్లిదండ్రుల తరఫున హజ్జ్ చేసి, హజ్ క్రియలను, ఆదేశాలను సజావుగా నెరవేర్చగలిగినట్లయితే – ఇదే మీ కొరకు ఉత్తమం. ఒకవేళ ధర్మావగాహన ఉన్న విశ్వసనీయత గల వ్యక్తిని ఈ విధి నిర్వహణ కోసం పంపినా ఫరవాలేదు. కాని మీరు మీ తల్లిదండ్రుల తరఫున ఈ కర్తవ్యాన్ని నెరవేర్చటమే మంచిది. కారణాంతరాలవల్ల ఇది సాధ్యం కాకపోతే ఈ పని కోసం ఎవరినయినా మీ తరఫున నియమించి, ఇది మీ తల్లిదండ్రుల తరఫున నెరవేరుస్తున్న హజ్ విధి అని అతనికి స్పష్టపరచాలి. ఇది మీ తరఫున వారికి జరిగే మేలు అని కూడా విడమరచి చెప్పాలి. అల్లాహ్ ఆమోదించుగాక!

telgo.indd 13 10/26/10 10:38 AM

అబ్దుల్ మతీన్ ఉమ్రీ

అబ్దుర్రహ్మాన్

ముస్లిం ధార్మిక విశ్వాసం

జాగృతి

ప్రశ్న: అల్లాహ్ తన సందేశహరులను ఎందుకు పంపాడు?

జవాబు: కేవలం తన దాస్యం వైపునకు పిలువడానికి, షిర్కు (బహు దైవారాధన)ను ఖండించడానికి మాత్రమే అల్లాహ్ తన సందేశ హరుల్ని పంపాడు.

ఖుర్‌ఆన్: మేము ప్రతి జాతిలోనూ ఒక ప్రవక్తను ప్రభవింపజేశాము. అతని ద్వారా ఇలా హెచ్చరిక చేశాము; అల్లాహ్ దాస్యం చెయ్యండి, మిథ్యా దైవాల ఆరాధనకు దూరంగా ఉండండి. (అన్ నహ్ల్: 36)

హదీస్: గౌరవ ప్రవక్తలు పరస్పరం సోదరులు. వారి ధర్మం ఒక్కటే. (దైవ ప్రవక్తలందరూ ఏకదైవారాధన వైపు ప్రజల్ని పిలిచారు.) (బుఖారీ, ముస్లిం)

ప్రశ్న: తౌహీదె ఉలూహియ్యత్ అంటే ఏమిటి?

జవాబు: తౌహీద్ ఉలూహియ్యత్ అంటే అన్ని రకాల ఆరాధనలకు అర్హుడు అల్లాహ్ మాత్రమేనని దృఢంగా విశ్వసించి ఆచరించటం. ఉదాహరణకు అర్థించడం, మొక్కు కోవడం వంటివి అల్లాహ్‌కే ప్రత్యేకించటం, తీర్మానాలు వ్యూహరచన చేసేవాడు అల్లాహ్‌యేనని భావించడం.

ఖుర్‌ఆన్: ప్రవక్తా! బాగా తెలుసుకో, అల్లాహ్ తప్ప ఆరాధ్య దైవం ఎవ్వడూ లేడు అని. (అంటే అల్లాహ్ తప్ప ఆరాధనకు అర్హుడు ఎవ్వడూ లేడు అని.) (ముహమ్మద్: 19)

హదీసు: మొదటగా నీవు దేని వైపునకు అయితే పిలుస్తావో అది 'లా ఇలాహ ఇల్లల్లాహ్' అయి ఉండాలి. (బుఖారీ, ముస్లిం)

ప్రశ్న: 'లా ఇలాహ ఇల్లల్లాహ్' అర్థం ఏమిటి?

జవాబు: ఆరాధనకు అర్హుడు కేవలం అల్లాహ్‌యే, ఆయన తప్ప ఆఆరధింప బడేవారందరూ మిథ్యా దైవాలే అని అర్థం.

ఖుర్‌ఆన్: ఎందుచేతనంటే అల్లాహ్‌యే సత్యం కాబట్టి, ఆయనను కాదని వారు పిలిచేవన్నీ అసత్యాలే కాబట్టి. (లుఖ్‌మాన్: 30)

హదీస్: 'లా ఇలాహ ఇల్లల్లాహ్' సద్వచనాన్ని పలికి, మిథ్యాదైవాల ఆరాధనను తిరస్కరించిన వ్యక్తి సంపద, రక్తం పవిత్రం అవుతాయి. (ముస్లిం)

ప్రశ్న: సిఫాతె ఇలాహి (అల్లాహ్ గుణ విశేషాలు)లో తౌహీద్ అనగానేమి?

జవాబు: అల్లాహ్, ఆయన ప్రవక్త (స) ఇద్దరూ అల్లాహ్ కోసం ప్రత్యేకం చేసిన గుణ విశేషాలను అంగీకరించడం.

ఖుర్‌ఆన్: ఆయనను పోలిన వస్తువు సృష్టిలో ఏదీ లేదు. ఆయన అన్నీ వినేవాడూ, అన్నీ చూసేవాడూను. (అష్ షూరా: 11)

హదీస్: మనందరి ప్రభువు ప్రతి రాత్రి సమీప ఆకాశానికి దిగి వస్తాడు. (ఈ దిగిరావడం అన్నది ఆయన వైభవానికి తగ్గట్టుగా ఉంటుంది.) (బుఖారీ, ముస్లిం)

ఆరోగ్యమే మహా భాగ్యం అంటారు. మరి ఈ భాగ్యాన్ని కాపాడుకునేవారు రాత్రి తొందరగా పడుకొని, ఉషోదయానికి ముందే లేవటం అవసరం. ఇది ఆరోగ్య సూత్రాల్లో అత్యంత ముఖ్యమైనది. వేళకు నమాజు చేసేవారు ఈ సూత్రాన్ని పాటించకుండా ఉండరు. ఎందుకంటే అనుదినం అయిదు పూటలు చేసే నమాజుల్లో మొదటి నమాజ్ (ఫజ్ర్ నమాజ్) ఉషోదయానికి ముందే ఉంది. కాబట్టి రాత్రి తొందరగా నిద్రపోతేనేగాని తెల్లవారు పెందలాడే మెలకువ రాదు.

అందుకే మహనీయ ముహమ్మద్ (స) వారు రాత్రి ఇషా నమాజు తర్వాత వ్యర్థ విషయాల్లో కాలక్షేపం చేయరాదని తాకీదు చేసేవారు. నిద్రాహారాల్లో ఈ సంతులనాన్ని పాటించే వ్యక్తి శారీరకంగా, మానసికంగా కూడా చురుగ్గా ఉంటాడు. తెల్లవారు జామున మస్జిద్ నుండి ముఅజ్జిన్ **అస్సలాతు ఖైరుమ్ మినన్ నౌమ్** (నమాజు నిద్రకన్నా ఎంతో మేలైనది) అంటూ ఇచ్చే పిలుపుకు **సదక్త వ బర్ర్త** (అవును నీవు సత్యమే పలికావు, నీకు పుణ్యఫలం ప్రాప్తించుగాక!) అని అతను వెంటనే స్పందిస్తాడు. పడకను వీడి కాలకృత్యాలు తీర్చుకుని, మస్జిద్ వైపునకు కదలి వస్తాడు.

అంతే కాదు, చిత్తశుద్ధితో నమాజ్ చేసే వ్యక్తి, మానవ సహజమైన దౌర్బల్యం వల్ల తప్పు చేయబోయినా అతని అడుగులు తడబడతాయి. ఆ క్షణంలో దైవ కారుణ్యం అతని చేతులను కట్టి పడేస్తుంది. తన చేష్టలపై తనకే సిగ్గేస్తుంది. "ఈ తప్పు చేసిన తరువాత నీవు నీ ప్రభువు సన్నిధికి ఏం మొహం పెట్టుకుని వెళ్ళగలవు?" అని మనస్సాక్షి అతన్ని నిలదీస్తుంది. "వీడు నమాజీ అయి ఉండి కూడా వెధవ పనులు చేస్తున్నాడు చూడండి!" అని జనులు ఎగతాళి చేస్తారేమోనన్న భయం కూడా అతనిలో కలుగుతుంది. అతని పాదాలు చెడు మార్గం వైపు పోయేటప్పుడు వణుకుతాయి. మొత్తమ్మీద నమాజ్ అతనిలో నిద్రాణమైవున్న నైతికతను తట్టి లేపుతుంది. దుర్మార్గాల నుండి రక్షిస్తుంది. నమాజు సృజించే సుగుణాన్ని అల్లాహ్ స్వయంగా ఇలా ప్రస్తుతించాడు:

"నిశ్చయంగా నమాజ్ సిగ్గు మాలినతనం నుండి, చెడు విషయాల నుండి ఆపుతుంది". (అన్ కబూత్: 45)

telgo.indd 14 10/26/10 10:38 AM

ఇది మక్కా నగరము

అబుల్ హసన్

ఇది మక్కా నగరము ఇది బక్కా పట్టణము
ఇది సమస్త మానవాళి మార్గదర్శక కేంద్రము

ఇచట ఆది మానవుడు ఆదం హవ్వాను కలిసెను
మానవ ప్రగతికి గట్టి పునాదులు వేసెను
ఇచట ఇబ్రాహీమ్ తన ఆలుబిడ్డలను తీసు
కొచ్చి కాబా ఒడిలో వదలి వెళ్ళెను

ఇచట తండ్రీకొడుకులు దైవ గృహాన్ని నిర్మించెను
ఇచట ఇస్మాయీల్ ప్రాణ త్యాగానికి సిద్ధమాయెను
ఇచట మూసా ప్రవక్త ముహమ్మద్ ప్రవక్త (స)
ధర్మశాస్త్రమ్ము కలిసిపోయి పరిపూర్ణమాయెను

రావోయి సోదరా రమ్ము ప్రియతమ్ముడా ఆఫ్రికా
నుండి, అమెరికా నుండి, ఆసియా నుండి, ఆస్ట్రేలియా నుండి
ఫ్లయిటు ఎక్కి, బస్సు ఎక్కి, ఓడ ఎక్కి, ఒంటె ఎక్కి పొమ్ము
సుమనోహర సుందర కాంతిమయము శాంతి
నిలయము కాబా ప్రాంగణము

మల్లె పూ రంగుల మేలిమి వస్త్రాలతో మోక
రిల్లు జనం కన్పడ ఖంగుతినకు విశ్వాస గణమది
తేనెలొలికించు పద సప్త రాగమాలలు విన్పడ
తెల్లబోకు లబ్బయిక్ అల్లాహుమ్మ నినాదమది

దైవ ప్రేమామృతాలు గుండెల్లో నిండగా
దర్శించుము అతీఖ్ ప్రతిష్ఠాలయము
అప్పుడు కనవయ్యా దివ్య ప్రదక్షిణ పరిమళాల
జల్లు కాబా గృహ ముగ్ద మనోహర దృశ్యము

అటు నుంచి హాజ్రె అస్వద్‌ను ముద్దాడవోయి
అది స్వర్గ సీమ నుండి రాలిన తునకవోయి

తవాఫ్ పూర్తి చేసి విశ్రాంతికై సాగి
పొమ్ము జమ్ జమ్ బావి గట్టు మీద
అచట నిలబడి కనుము జమ్ జమ
జలం సేవించు విశ్వాస సమూహమ్మును

అటుపిమ్మట సఫా పర్వతమ్ము ఎక్కా
లోయి అది హాజిరా సాధనకు చిహ్నమోయి
శిరోముండనం లేదా వెంట్రుకలు కత్తిరించ
వోయి, అది చెడు విసర్జనకు గురుతువోయి

మక్కా నగరము నీదే సుమా! నీవు
పరాయివాడవనుకోకు కలలోనైనా
రహ్మాన్ అతిథివి అల్లాహ్ రాయబారివి
ఆయన పిలవగ వచ్చిన సౌభాగ్యుడివి

తఖ్వాయే నీ ఆభరణము దైవ స్తుతియే నీకు ఆహారము
సహనమే నీకు సౌందర్యము స్వర్గమే నీ నివాసము

కాబా ఇచ్చే సందేశము –
వేషం వేరైనా, భాష వేరైనా
రంగులు వేరైనా, సంస్కృతులు వేరైనా విశ్వమంతా
విశ్వకర్త దాసులు జగమంతా ఒకే కుటుంబ సభ్యులు

ఈ పవిత్ర పట్టణ ప్రాంగణంలో...

ఈ ప్రతిష్ఠ ఆరాధనాలయంలో
ఎన్ని దివ్యావిష్కృతులు ప్రసరించినాయో
ఈ పవిత్ర కాబా గృహంలో
ఎన్ని తమస్సులు తొలగినాయో

ఈ మక్కా నగర వీధుల్లో
ఎన్ని సత్య స్మృతులు చల్లబడినాయో
ఈ పవిత్ర పట్టణ ప్రాంగణంలో
ఎన్ని లబ్బయిక్ నినాదాలు విన్పించినాయో

ఈ నిర్జీవ నల్ల రాతి లోయలో
ఎన్ని వాస్తవాలు ఆవిష్కరించబడినాయో
ఈ బంజరు బీడువారిన అవనిలో
ఎన్ని మానవ రాసి ముత్యాలు దాగినాయో

ఈ అరఫా మైదానం విడిదిలో
ఎన్ని పాపాలు కడగబడినాయో
ఈ మినా మైదాన మట్టిలో
ఎన్ని త్యాగాలు ప్రతిఫలించినాయో

ఈ రమీ జమరాత్‌ల పోరులో
ఎన్ని దుష్ట శక్తులు తరమబడినాయో
ఈ శిరోముండన మేళలో
ఎన్ని దౌష్ట్యాలు పరిత్యజించబడినాయో

ఈ మార్గదర్శక కేంద్రావనిలో
ఎన్ని సమతా రాగాలు ఆలాపించబడినాయో
ఈ సఫా మర్వాల సయీలో
ఎన్ని మాతృ ప్రేమలు ఇంకి ఉన్నాయో
ఈ అతీఖ్ గృహ తవాఫ్‌లో
ఎన్ని జీవితాలు ధన్యమయినాయో

ఈ కాంతి శిఖర గుహలో
ఎన్ని దివ్య కాంతులు ప్రకాశించినాయో
ఈ సౌర్ గుహ ఒడిలో
ఎన్ని స్నేహ సౌరభాలు గుభాళించినాయో

అందుకే –
ఈ కాబా విశ్వ మార్గదర్శక కేంద్రం అయింది
అందుకే –
ఈ నిఖిల జగతికి నీతి శాస్త్రాన్ని అందించింది.

telgo.indd 15 10/26/10 10:38 AM

మానవ సమైక్యతకు మూల సాధనం

షేఖ్ రియాజ్



అల్లాహ్ తాను సృష్టించిన జీవరాసులన్నింటిలో మానవుడిని అత్యున్నతంగా ఎంతో అందమైన రీతిలో సృష్టించి అతని కొరకు పూర్తి సృష్టిని లోబరిచాడు. కనుక అటువంటి ఏకైక సృష్టికర్త అయిన అల్లాహ్‌కు కృతజ్ఞతగా మనిషి తన పూర్తి జీవితం ఆయన్నే ఆరాధిస్తూ, పూజిస్తూ, విధేయతను పాటిస్తూ గడపాలి.

నమాజు దైవానికి – దాసునికి మధ్య సంబంధాన్ని పటిష్టపరిచే మాధ్యమం. నమాజు ఒక దాసునికి – అతని ప్రభువుకి మధ్య జరిగే సంభాషణ. నమాజు దారి తప్పిన హృదయాన్ని దైవసన్నిధికి చేర్చే సాధనం.

సృష్టి మొత్తం అల్లాహ్‌నే ఆరాధిస్తోంది

"సప్తాకాశాలు, భూమి, వాటిలో ఉన్నవన్నీ ఆయన (అల్లాహ్) పవిత్రతనే కొనియాడుతున్నాయి. ఆయన స్తోత్రంతోపాటు ఆయన పవిత్రతను కొనియాడని వస్తువంటూ ఏదీ లేదు. అయితే మీరు వాటి స్తుతిని గ్రహించలేరు. ఆయన గొప్ప సహనశీలుడు, క్షమా గుణం కలవాడు". (బనీ ఇస్రాయీల్: 44)

ఈ విశ్వంలోని సమస్త సృష్టిరాసులు సూర్యుడు, చంద్రుడు, ఆకాశాలు, నక్షత్రాలు, గ్రహాలు, భూమి, వృక్షాలు, జంతువులు, పక్షులు, పర్వతాలు, సముద్రాలు, నదులు – ఇలా సమస్త సృష్టిలోని వస్తువులు వాటికి ఇష్టం ఉన్నా, ఇష్టం లేకపోయినా అల్లాహ్‌నే ఆరాధిస్తున్నాయి. ఆయనకే విధేయత చూపుతున్నాయి. ఆయన ముందే సాష్టాంగపడుతున్నాయి. కాని వీటిని స్తుతించే విధానం ఎలా ఉంటుంది? అనేది మన బుద్ధికి అందనిది. ఇప్పటి వరకు మానవుని జ్ఞానం అంతవరకూ చేరలేదు. వీటిని సృష్టించిన సృష్టికర్త అల్లాహ్‌కే బాగా తెలుసు. ఆకాశాలలోను, భూమిలోను ఉన్న సృష్టితాలన్నీ తమకు ఇష్టమున్నా లేకపోయినా – అల్లాహ్‌కు సాష్టాంగపడుతున్నాయి. వాటి నీడలు సయితం, ఉదయం సాయంత్రం" (ఆయనకే సాష్టాంగ ప్రణామం చేస్తున్నాయి). (అర్రాద్: 15)

మానవుడు సర్వ స్వతంత్రుడా?

సృష్టిమొత్తం అల్లాహ్‌ను స్తుతిస్తూ, ఆరాధిస్తూ, ఆయనకే విధేయత చూపుతుంటే మరి అల్లాహ్‌యొక్క సృష్టితాలలోని మనిషి దీనికి అతీతుడా? లేక స్వతంత్రుడా? లేదనే సమాధానం వస్తుంది. ఎందుకంటే, మానవుడు తనకు స్వాతంత్ర్యాధికారాలు లేని రంగంలో అల్లాహ్ నిర్దేశించిన ఈ ప్రకృతి చట్టానికే తలవొగ్గి వ్యవహరిస్తున్నాడు. ఉదాహరణకు:– మానవుడు కాళ్ళకు బదులు చేతులతో నడవలేడు. కళ్ళకు బదులు చెవులతో చూడలేడు. నోటికి బదులు ముక్కుతో మాట్లాడలేడు. దీనివల్ల తెలిసేదేమిటంటే, మానవుడు అన్ని రంగాలలో సర్వ స్వతంత్రుడు కాడు. కాని దేవుడు మానవులకు కొన్ని స్వేచ్ఛాధికారాలు ఇచ్చాడు. మానవులకు మాత్రమే మంచి, చెడు, ధర్మాధర్మాల విచక్షణా జ్ఞానం ఇచ్చి అందులో ఏదైనా ఎంచుకొని ఆచరించే స్వేచ్ఛ ఇచ్చాడు.

మానవుడు దేవుడిచ్చిన ఈ స్వేచ్ఛను వినియోగించుకొని దేవుడు నిర్ణయించిన ఆరాధనా పద్ధతులు, కుటుంబ, సామాజిక, రాజకీయ, ఆర్థిక విధానాలను పాటించి, అల్లాహ్‌కు విధేయుడై పోవచ్చు లేదా వాటిని తిరస్కరించి అవిధేయుడైపోవచ్చు ఒకవేళ దైవ శాసనాన్ని ధిక్కరిస్తే అతను ఇహలోకంలో అశాంతికి, పరలోకంలో నరకయాతనకు గురవుతాడు. దానికి బదులు అతను దేవునికి విధేయుడై, ఆయన ఆజ్ఞలను శిరసావహిస్తే ఇహలోకంలో శాంతి, పరలోకంలో దేవుని ప్రసన్నతా భాగ్యం, మరియు స్వర్గ సౌఖ్యాలు లభిస్తాయి. ఖుర్‌ఆన్‌లో ఇలా ఉంది:

"నిస్సందేహంగా ఎవరైతే విశ్వసించి, సత్కార్యాలు చేస్తారో వారి కోసం కింద కాలువలు ప్రవహించే ఉద్యానవనాలున్నాయి. ఇదే గొప్ప విజయం". (అల్ బురూజ్: 11)

telgo.indd 16 10/26/10 10:39 AM

మానవుల్లో దేవుడిని ఆరాధించే వేర్వేరు పద్ధతులు ఎలా చోటు చేసుకున్నాయి?

సృష్టికర్త అయిన అల్లాహ్ మనిషి స్వభావంలోనే దైవభీతి, దైవ భక్తి అనే భావనల్ని ఇమిడ్చాడు. దీనినే మనం మన పరిసరాలలో అన్ని మతాల వారిలో చూస్తాము. కాని శోచనీయమైన విషయ మేమిటంటే, మానవులలో అధికులు తమను సృష్టించిన అసలు సృష్టికర్తను వదలి అమాయకంగా సృష్టితాలను పూజిస్తున్నారు, ఆరాధిస్తున్నారు.

మానవుల సృష్టి ఈ భూమ్మీద ఏర్పడినప్పటి నుంచి మానవుల మార్గదర్శనం కొరకు అల్లాహ్ ఒక లక్షా ఇరవై నాలుగు వేల మంది ప్రవక్తల్ని పంపి గ్రంథాలను కూడా అవతరంపజేశాడు. ఆయాకాలాల్లో వచ్చిన ప్రవక్తలు తమ జాతి జనులకు అల్లాహ్‌ను ఆరాధించే పద్ధతులను తెలియజేశారు. కాని అల్లాహ్‌ను, ఆ ప్రవక్తలను విశ్వసించనివారు విగ్రహాలను, సూర్యుడ్ని, చంద్రుడ్ని, వర్షాన్ని, జంతువులను, చెట్లను, పుట్టలను తమ ఆరాధ్య దైవాలుగా చేసుకుని పూజించటం, ఆరాధించటం చేస్తూ వచ్చారు. ఈ ప్రవక్తల పరంపరలో చిట్టచివరి ప్రవక్త ముహమ్మద్ (స). చిట్ట చివరి గ్రంథం ఖుర్‌ఆన్ అవతరించాక దానిని విశ్వసించినవారు, ఆయన (స) చూపిన విధంగా దేవుడిని స్తుతిస్తున్నారు, ఆరాధిస్తు న్నారు. కాని అవిశ్వాసులు మాత్రం సృష్టికర్తను వదలి సృష్టితాలను పూజిస్తున్నారు. ఇంకా కొందరైతే గతించిన ప్రవక్తలనే దేవుళ్ళుగా చేసి వారినే ఆరాధిస్తున్నారు.

ఇప్పుడైనాసరే ఇతర మతావలంబీకులు తమ వద్ద ఉన్న గ్రంథాలు ఎన్ని మార్పులు చేర్పులకు గురైనా కూడా వాటిలో సృష్టికర్త ఒక్కడేనని, అంతిమ దైవ ప్రవక్త ముహమ్మద్ (స) రాబోవుచున్నారని, వారిని విశ్వసించమని, వారికే విధేయత చూపమని ఉంది.

సత్యాన్ని ప్రేమించేవారు, ఇహలోకంలో శాంతిని కోరుకునేవారు, పరలోక సాఫల్యాన్ని అభిలషించేవారు ఆయా గ్రంథాలను పరిశోధించాలి, వాటితోపాటు అంతిమ దైవ గ్రంథం ఖుర్‌ఆన్‌ను కూడా చదవాలి. అప్పుడు వారికి సరైన మార్గం కనబడుతుంది. అప్పుడు భూమ్మీద ఉండే మానవులంతా ఒకే దేవునికి ఒకే విధమైన పూజలు, ఆరాధనలు, ప్రార్థనలు చేయనారంభిస్తే మానవుల మధ్య ఉన్న ఈ దూరాలు అంతరిస్తాయి. ఇహలోకంలో శాంతి వర్ధిల్లుతుంది. పరలోకంలో సాఫల్యం వరిస్తుంది. అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

" మీ ఈ సమాజం (జీవన ధర్మం) వాస్తవానికి ఒకే సమాజం. నేను మీ అందరి ప్రభువును. కనుక మీరు నన్నే ఆరాధించండి. కాని ప్రజలు పరస్పరం విభేదించుకొని తమ ధర్మాన్ని చీలికలుగా చేసుకున్నారు. కాని చివరికి అందరూ మా వద్దకు మరలి రావలసి ఉంది". (అల్ అంబియా: 92, 93)

సర్వతోముఖ వికాసానికి సోపానం నమాజు

- **నమాజు విశ్వాసి జీవితంలో ప్రత్యేకంగా కానవచ్చే ప్రధానాంశం**
- **నమాజు విశ్వాసి జీవితం నుండి విడదీయరాని అవి భాజ్యాంశం.**
- **నమాజు విశ్వాసి జీవితానికి వన్నె తెచ్చే, స్వర్గానికి గొనిపోయే కాంతి పుంజం.**
- **నమాజు సృష్టికర్త అయిన అల్లాహ్ విశ్వాసులను అనుగ్రహించి ప్రసాదించిన అత్యద్భుత బహుమానం.**
- **నమాజు అల్లాహ్ తన ప్రియ ప్రవక్తని సప్తాకాశాలపైకి (మేరాజ్ ద్వారా) పిలిపించుకుని మరీ ప్రసాదించిన అమూల్య వరం.**
- **నమాజు కన్నులకు చల్లదనాన్నిస్తుంది. ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా అంటుండేవారు: "ఖుర్రతు ఐనీ ఫిస్సలాతి" – నా కంటి చలువు నమాజులో ఉంది.**
- **నమాజు హృదయానికి శాంతిని, స్వస్థతను, నెమ్మదిని చేకూర్చుతుంది. అందుకే కారుణ్యమూర్తి ముహమ్మద్ (స) కలత చెందినప్పుడల్లా "యా బిలాల్ అరిహ్నా బిస్సలాత్" – ఓ బిలాల్! నాకు నమాజు ద్వారా నిమ్మళాన్ని చేకూర్చు" అంటుండేవారు.**
- **నమాజు గురించి ప్రళయ దినాన మొట్టమొదట ప్రశ్నించ బడుతుంది.**
- **నమాజు ఉపాధిని లాక్కువస్తుంది.**
- **నమాజు అశ్లీల కార్యాల నుండి, చెడు పనుల నుండి నిరోధిస్తుంది**
- **నమాజు ఏకాగ్రతను, దైవభక్తిని, పాప భీతిని, స్వర్గ ప్రీతిని పెంపొందిస్తుంది.**
- **నమాజు మనిషి యొక్క బలహీనతల వల్ల జరిగే చిన్న పాపాల మన్నింపుకు కారణమవుతుంది.**

సోదరసోదరీమణులారా! ఇలా నమాజు యొక్క ఘనతను గురించి వ్రాసుకుంటూపోతే ఇంకా ఎన్నో ఉన్నాయి. శోచనీయ మైన విషయమేమిటంటే ఇంతటి మహత్వార్వకమైన నమాజు విషయంలో ముస్లింలు ఏమరుపాటుకు గురై ఉన్నారు. నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇలా నమాజును వదలి ముస్లింలు మానసికంగానూ, శారీరకంగానూ, పారలౌకికంగానూ నష్టపోతున్నారు.

సోదరులారా! మేలుకోండి. వేళకు నమాజు చేయండి. మహా ప్రవక్త ముహమ్మద్ (స) ఇహలోకాన్ని వీడిపోయే చివరి ఘడియల్లో కూడా ముస్లిం సమాజానికి 'నమాజు, నమాజు' అనే సెలవిచ్చారు. అంటే నమాజు గురించి శ్రద్ధ వహించండి, నమాజును విడువకండి అని ప్రవక్త (స) చెప్పదలిచారు. ప్రవక్త (స)ను ప్రాణప్రదంగా ప్రేమించే ముస్లిములారా! ప్రవక్త (స) చివరి పలుకులను మీ హృదయాలలో నాటండి. నమాజును వదలకండి. చూడండి అల్లాహ్ ఏమంటున్నాడో!

"ఆ నమాజీలకు వినాశనం తప్పదు, (ఎందుకంటే) వారు తమ నమాజుల పట్ల అశ్రద్ధ వహిస్తారు. వారు (ఒకవేళ నమాజు చేసినా) ఇతరులకు చూపటానికి చేస్తారు"".

(అల్ మాఊన్: 4-6)

telgo.indd 17 10/26/10 10:39 AM

హ్యూమన్ మెమరీ ఈజ్ టూ షార్ట్

(5పేజీ మిగతా భాగం..)

బిజెపి జనతాదళ్ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకుంది. నీతికి నిలబడి నిజాయితీగా రాజకీయాలను ముందుకు తీసుకుపోతానని చెప్పిన వి.పి.సింగ్ హుందాగా పదవి త్యాగం చేశారు. ఆనక కాంగ్రెస్ మద్దతుతో ప్రధాని అయిన శ్రీ చంద్రశేఖర్‌దీ మూన్నాళ్ల ముచ్చటే అయింది. మధ్యంతర ఎన్నికలు అనివార్య మయ్యాయి. ఎన్నికల ప్రచారానికి వచ్చిన రాజీవ్ గాంధీ శ్రీపెరంబుదూరు (తమిళ నాడు)లో దారుణ హత్యకు గురయ్యారు. అనంతరం శ్రీ పి.వి. నరసింహారావు భారత ప్రధాని అయ్యారు. కొన్నాళ్ళు పరిస్థితి ప్రశాంతంగానే ఉన్నట్లు కనిపించింది. 1992 ఆఖర్లో మళ్ళీ ఏకాత్మతా యాత్రలు మొదలయ్యాయి. మరోసారి 'ఛలో అయోధ్యకు' అన్నారు.

1992 డిసెంబర్ 6

అది స్వతంత్ర భారత ప్రజాస్వామిక చరిత్రలోనే అత్యంత దుర్దినంగా నిలిచిపోతుంది. అద్వానీ, మురళీ మనోహర్ జోషి వంటి అగ్రనేతల సారథ్యంలో అయోధ్యకు తరలివచ్చిన లక్షలాది మంది రామభక్తులు బాబరీ మస్జిద్‌ను చుట్టుముట్టారు. మధ్యాహ్నానికల్లా కట్టడాన్ని నేలమట్టం చేసి విగ్రహాలను ప్రతిష్ఠించారు. 'సియారామ్! హోగయా కామ్' అని నినదిస్తూ సాయంత్రం వెనుదిరిగారు. అక్కడ మోహరించబడి ఉన్న వేలాది మంది సైనికులు, పోలీసు అధికార్లు ప్రేక్షక పాత్ర పోషించారు. ఒకవైపు విదేశీ ప్రసార సాధనాలు అయోధ్యలో జరిగే విధ్వంసాన్ని ప్రసారం చేస్తున్నప్పటికీ భారత మీడియా మాత్రం సాయంత్రం 5:00 గంటల వరకూ ప్రజలకు వివరాలు అందించకుండా 'చాలా జాగ్రత్త' వహించింది. జరగరాని దారుణం జరిగిపోయిన తర్వాత భారత ప్రధాని శ్రీ పి.వి. నరసింహారావు సాయంత్రం 7:00 గంటలకు గంభీర వదనంతో 'దూర దర్శన్'లో దర్శన మిచ్చారు. జాతి ప్రజలకు సందేశమిస్తూ, బాబరీ మస్జిద్ నేలమట్టమైందని తెలుపటానికి విచారిస్తున్నామన్నారు. దీనిని యావద్దేశం సిగ్గుతో కుంచించుకుపోవలసిన సంఘటనగా అభివర్ణించారు. ఆ తరువాత యమ సీరియస్‌గా "మస్జిద్ పునర్నిర్మాణం జరిగి తీరుతుంది. అదే స్థలంలో మస్జిద్ నిర్మించబడుతుంది" అని దూర దర్శన్ సాక్షిగా దేశ ప్రజలకు మాటిచ్చారు. కాని ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామిక దేశానికి ప్రధానిగా ఉన్న వ్యక్తి ఆనాడు ఇచ్చిన మాట మాట కాదని, అది వట్టి నీటి మూట మాత్రమే నని తరువాతి కాలంలో తేలిపోయింది.

అనర్థాలకు మూలం

ఈ విధ్వంస కాండకు మంచిని ప్రేమించే వారంతా బాధతో మూలిగారు. శాంతి కాముకులు తీవ్రంగా కలత చెందారు. భారత ముస్లింలంతా విలపించారు. మరునాడు ఉదయం శోక సంతప్త హృదయంతో పలు నగరాలలో ముస్లిం కుర్రాళ్ళు తమ అక్కాచెల్లెళ్ళు వేసుకునే నల్ల రంగు బోణీలనే చింపి నల్ల బ్యాడ్జీలుగా కట్టుకుని నిరసన తెలిపేందుకు రోడ్ల పైకివచ్చారు. అంతకు ముందు రోజు మస్జిదును ధ్వంసంచేస్తుంటే ప్రేక్షక పాత్ర పోషించిన భద్రతా దళాలు ఆనాడు మాత్రం తమ తుపాకులకు పని కల్పించారు. ఒక్క వారంలోనే వందలాది మంది బలైపోయారు. దేశంలోని ఎన్నో నగరాలలో కర్ఫ్యూ విధించబడింది. ముస్లిం మైనారిటీల్లో భద్రతారాహిత్య భావన పెరిగిపోయింది. అంతలోనే వాణిజ్య నగరమైన బొంబాయి బాంబు పేలుళ్ళతో దద్దరిల్లింది. రెండు వందలకు పైచిలుకు అమాయకులు ఈ అమానుషానికి ఆహుతి అయ్యారు. బాబరీ మస్జిద్ విధ్వంసం తరువాత దేశంలో ఏర్పడిన పరిస్థితులకు నిరాశ చెందిన ముస్లిం యువకుల్లో కొందరు విచ్ఛిన్నకర శక్తుల వైపుకు మొగ్గారు. తత్కారణంగా వారు తమ ఉజ్వల భవిష్యత్తును చేజేతులా నాశనం చేసుకోవటమే గాకుండా దేశంలో అస్థిరతను సృష్టించే ముష్కర మూకగా చెడ్డ పేరు తెచ్చుకున్నారు. మన వల్ల జరిగే ఒక చారిత్రక తప్పిదం ఎన్ని అనర్థాలకు మూలమవుతుందో చెప్పటానికే ఈ పంక్తులు వ్రాయవలసి వస్తోంది.

దూర దర్శన్ సాక్షిగా!

నేటి నవతరానికి ఇవేమీ గుర్తుండక పోవచ్చు. నవతరమే కాదు, పాత తరానికి మాత్రం ఎక్కడ జ్ఞాపకముంటుంది? మనిషి జ్ఞాపక శక్తి మరీ పరిమితం. 'హ్యూమన్ మెమరీ ఇజ్ టూ షార్ట్'. అలహాబాద్ హైకోర్టు తీర్పులో చారిత్రక విషయాలెన్నో పరిగణనలోకి రాలేదని ముస్లిం పర్సనల్ లా బోర్డు అభిప్రాయపడిందంటే అందులో వాస్తవం లేకపోలేదు. అంతెందుకు, మస్జిద్ ధ్వంసం చేయబడిన నాడు సాయింత్రం 'మస్జిద్‌ను అక్కడే తిరిగి నిర్మిస్తాం. అని గంభీరంగా ప్రకటించిన సాక్షాత్తూ ప్రధానమంత్రే తరువాత మాట మార్చారు.

ముస్లింలకు మనవి

ఈ సందర్భంగా భారత ముస్లింలు ఏమాత్రం నిరాశా నిస్పృహలకు లోను కానవసరం లేదని మేము మనవి చేస్తున్నాము. వారు ప్రతి కీడు నుండి మేలును అన్వేషించాలి. ప్రతి నష్టం నుంచి లాభాన్ని తరచి చూడటం నేర్చుకోవాలి. తమ ప్రవక్త(స) మక్కా జనులతో చేసుకున్న 'హుదైబియా ఒడంబడిక' నుండి వారు సతతం స్ఫూర్తిని పొందుతూ ఉండాలి. పైకి అపజయంగా కనిపించిన హుదైబియా నిర్యుద్ధ సంధి కేవలం రెండేళ్ళలోనే ఎలా ఘన విజయంగా రూపుదాల్చిందో వారు మననం చేసుకోవాలి. 1992లో ఒక మస్జిద్ కూల్చబడిన సంగతి నిజమే. కాని ఆ తరువాత ముస్లిం సముదాయంలో వచ్చిన ధార్మిక చైతన్యం వారిలో

telgo.indd 18 10/26/10 10:39 AM

పేరుకుని ఉన్న స్తబ్ధతా దుమ్మును ఎలా దులిపిందో, ఒక్క మస్జిదుకు బదులు వేలాది మస్జిదులు ఎలా శీఘ్రగతిన నిర్మితమైనాయో వారు ఒకసారి నెమరు వేసుకోవాలి. ఇంతకన్నా సంతోషకరమైన విషయమేమిటంటే మస్జిదులు యువ నమాజీలతో కళకళలాడసాగాయి. ఈ యువతరం ఇప్పుడు విద్యావిషయకంగా కూడా మునుముందుకు దూసుకు పోతోంది. ఎవరో వస్తారని... ఏదో చేస్తారని ఎదురు చూసి మోసపోకుండా వారు తమ భవిష్యత్తుకు తామే రాచబాట వేసుకుంటున్నారు. ఇది శుభ సూచకం. స్వతంత్ర భారతంలో అర్ధ శతాబ్దిగా ముస్లిం సమాజంలో ఆవరించిన నిర్లిప్తత క్రమేణా తొలుగుతోంది. ఈ తరుణంలో ముస్లింలు గతం నుండి గుణపాఠంనేర్చుకుని ఎదురీత సాగించాలి. మదిలో రేగే గాయాల నుండే పట్టుదలను పుణికి పుచ్చుకోవాలి. అదే సమయంలో వారు తమ ఆంతర్యంలోకి తొంగిచూసుకోవాలి. తమ భక్తితత్పరతలో గల కల్తీ శాతం ఎంతో, మేలిమి శాతం ఎంతో పరికించి కల్తీని దూరం చేసుకోవాలి. పనికిమాలిన పాక్షిక, సాపేక్షిక విషయాల వెనుక పడిపోయి దైవ ధర్మానికి, శ్రేష్ఠ సమాజానికి తెస్తున్న అపఖ్యాతిని గురించి నిజాయితీగా ఆత్మ పరిశీలన చేసుకోవాలి. ఈనాడు 'ఉమ్మత్'కు కావలసింది వారి ఉపచారాలేగాని అపచారాలు కాదు. అన్నిటికన్నా ముఖ్యంగా వారు తమ నిజదైవంతో సంబంధం ఏర్పరుచుకోవాలి. దేవుని త్రాడును గట్టిగా పట్టుకుని కష్టకాలంలో క్షణం క్షణం దైవోపదేశాల నుండి ప్రేరణ పొందుతూ ఉండాలి. అవును...

"కృంగిపోకండి. ఆవేదన చెందకండి. నమ్మి నడుచుకుంటే మీరే పైకి వస్తారు".
(3: 139)

"మంచీ - చెడు ఎన్నటికీ సమానం కాలేవు. నీవు చెడును మంచి ద్వారా తొలగించు. ఆ తరువాత (నువ్వే చూస్తావు) నీతో బద్ధ విరోధం ఉన్నవాడే నీకు ప్రాణస్నేహితుడైపోతాడు". (41: 34)

ఇది నిజం

ఇది చారిత్రక సత్యం. మహా ప్రవక్త ముహమ్మద్ (స)కు కీడు తలపెట్టబోయిన ఉమర్ (ర) కడకు ప్రాణ మిత్రుడు కాలేదా? ఉహద్ సంగ్రామంలో ముస్లింల ఓటమికి కారకుడైన ఖాలిద్ బిన్ వలీద్ (ర) ఆ తర్వాతి కాలంలో విశ్వాసిగా మారి ఎన్నో ముస్లిం విజయాలలో కీలక పాత్ర పోషించలేదా? నేడు కర్మ భూమిలో కోట్లాది మంది సత్యం కోసం తహతహ లాడుతున్నారు. పరమ ప్రభువు ఎవరి ద్వారా ఏ ఘనకార్యం చేయించుకుంటాడో, ఎవరు ఏ చరిత్రను సృష్టించబోతున్నారో మనకు తెలీదు. 1992 డిశంబర్ 6న మస్జిద్‌ను ధ్వంసం చేసిన రామభక్తుల్లో కొందరు తర్వాత పశ్చాత్తాపం చెంది ఇస్లాం స్వీకరించిన ఉదాహరణలను ఈ సందర్భంగా మరువ రాదు.

భారత ముస్లింలారా! మీరు భీతిల్లకండి. నిస్పృహకు లోనుకాకండి. నిష్కల్మషమైన విశ్వాసంతో మీ ప్రభువు వైపునకు మరలండి. మీ వల్ల జరిగిన తప్పిదాలపై సిగ్గుపడుతూ క్షమాభిక్షకై దైవాన్ని అర్థించండి. ఆయన గొప్ప క్షమాశీలి. దయాసాగరుడు. మీరు నికార్సయిన విశ్వాసులుగా, నిజ ముస్లింలుగా రాణించండి. మళ్ళీ మీ గౌరవోన్నతుల చరిత్ర పునరావృతమవుతుంది.





ఉమ్రీ బ్రాదరీ ఆధ్వర్యంలో జరిగిన కవి సమ్మేళనంలో ఒక దృశ్యం





IPC ఆధ్వర్యంలో జరిగిన క్విజ్ ప్రోగ్రాంలో బాల విజేతలు

telgo.indd 19 10/26/10 10:39 AM

హసన్ సయ్యిద్

షిర్క్ పుట్టు పూర్వోత్తరాలు -5

ఇప్పుడు దైవ ప్రవక్త (స) గారి మహితోక్తుల వెలుగులో మన భారత దేశ ముస్లిం జీవనాన్ని పరిశీలిద్దాం. పూర్వం భరత ఖండంలో ఉన్న నేటి పాకిస్తాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్‌లునైతేనేమీ, కజకిస్తాన్, వజీరిస్తాన్, ఈరాన్, బర్మా, థాయిలాండ్ లాంటి పొరుగు దేశాలైతేనేమీ అన్నింటా మనకు కానవచ్చే దృశ్యం ఒక్కటే – అది బహుదైవారాధన.

నేడు ప్రతి గల్లీలోనూ ఓ జెండా చెట్టు పుట్టుకొచ్చింది. ప్రతి ఊరిలోనూ ఓ సమాధి (దర్గా) కనిపిస్తుంది. దాదాపు ప్రతి ఇంటిలోనూ కొన్ని చిత్రపటాలు దర్శనమిస్తాయి. మరి ఈ దురాచారాల్ని సయితం ఇస్లామీయ సదాచారాలుగానే అభివర్ణిద్దామా? రాతి శిల్పాలను, శవాలుగా మార్చుకొని, జాతరలని, ఉరుసులని పేరుబెట్టి, వినాయకుని నిమజ్జనం, దసరా, మధురైలోని నిప్పులు తొక్కే ఆచారం – వీటన్నింటినీ కలగూర గంపచేసి 'పీర్ల పండగ' అని నామకరణం చేసి, నైవేద్యాన్ని చక్కెర, బెల్లం, మలీదగా మార్చి, అర్చనను ఫాతెహా రంగులు అద్ది, రావి చెట్టును జెండా చెట్టుగా రూపం ఇచ్చి చిందులు తొక్కడం ఇస్లాం ధర్మాన్ని చీల్చి చెండాడటం కాదా? అటు సప్త ఋషుల భార్యలుంటే, ఇటు పది మంది స్త్రీలు (దస్ బీబియోఁకి కహానీలు). అటు లక్ష్మి, కాళికాదేవీలుంటే, ఇటు ఉజ్లే పరీ, కాలీ పరీలు. అటు అమ్మవారు అయ్యవార్లుంటే, ఇటు అమ్మా జాన్ బావాజాన్‌లు,. అక్కడ లక్ష్మి కుండలుంటే, ఇక్కట జాఫర్ కుండలు. అక్కడా పాయసమే, ఇక్కడా పాయసమే. లక్ష్మి దుర్గాలని చెప్పేవారు, అమ్మవారు అయ్యవారు అనేవారు, మందిరానికి జాతరలకి వెళ్ళేవారు, రావి చెట్టు చుట్టూ ప్రదక్షిణలు చేసేవారు విగ్రహారాధకులు. మన భాషలో కాఫిర్లు (దైవ వ్యతిరేకులు) నరకవాసులు అయితే, పేర్లు మార్చి ఈ దురాచారాలన్నీ చేసే మనం స్వర్గానికి వెళతామా? ప్రవక్తగానీ, అల్లాహ్‌గానీ మనకేమన్నా ప్రమాణం చేసి ఉన్నారా? ఏమైనా రాయితీ కల్పించి ఉన్నారా? నేడు ఇన్ని చేస్తూ మనం చెప్పే మాటనే నాడు యూదులు సయితం చెప్పారు. అయితే వారు చెప్పిందల్లా నిజమైపోయిందా? చూడండి!

"యూదులు, క్రైస్తవులు తాము అల్లాహ్ (దేవుని) బిడ్డలమని, ఆయనకు ప్రియమైనవారమని అంటారు".

(దివ్యఖుర్‌ఆన్– 5: 18)

"పైగా వారు, ఈ నరకాగ్ని మమ్మల్ని తాకనైనా తాకదు. కాకపోతే కొన్నాళ్ళు కాస్తంత బాధ కలిగిస్తుందంతే' అంటారు. అలాగైతే, మీరు దేవునితో ఏదైనా ఒడంబడిక చేసుకున్నారా, దాన్ని ఆయన ఉల్లంఘించకపోవడానికి? లేక అ... విషయంలో మీరు మీకు ఏ మాత్రం తెలియని మాటలు అంటున్నారా?' అని అడగండి వారిని. (దివ్యఖుర్‌ఆన్–2:80)

దివ్య ఖుర్‌ఆన్‌లో 25 మార్లు పేర్కొనబడిన మాజత్ ఈసా (అ)ను పూజించేవారు, ఆయనకు లేని స్థానాన్ని కల్పించేవారు శిక్షార్హులు, నరకవాసులు అంటే... ముందు వెనకా అసలు ఒక చరిత్రంటూ లేని అనామకులైన బాబాలు, దర్గాలను పూజించే వారు, వాటి చుట్టూ ప్రదక్షిణలు చేసేవారు స్వర్గవాసులు ఎలా కాగలరు? 'మేము ఎన్ని చేసినా చెల్లుతుంది. చివరికి మేము స్వర్గానికే వెళతాము, ఎందుకంటే– మేము జన్మతః ముస్లింలము, మా తాతముత్తాతలు ముస్లింలు' అంటారా! అయితే ఇస్లాం ఏమన్నా మన తాతముత్తాతల వారసత్వపు సొత్తా? పంచుకోవ డానికి!! లేక ముస్లిం కడుపున పుట్టినవాడల్లా ముస్లిం అయి పోతాడా? చూడండి, ఖుర్‌ఆన్ ఈ విషయంలో ఏమంటుందో!

(తన కొడుకు కోసం సిఫారసు చేస్తూ) **"నూహ్ దైవాన్ని వేడుకుంటూ 'ప్రభూ! నా కొడుకు నా కుటుంబానికి చెందినవాడు కదా ! అన్నాడు". (దివ్య ఖుర్‌ఆన్–11: 45)**

అందుకు అల్లాహ్ ఏం సమాధానమిచ్చాడో కూడా కాస్త గమనించండి! **"నూహ్! అతను నీ కుటుంబానికి చెందినవాడు కాదు. అతను (నీ కడుపున చెడబుట్టిన) పరప అప్రయోజ కుడు".** (దివ్యఖుర్‌ఆన్– 11: 46)

ముస్లిం ఇంట పెళ్ళి చేసుకుంటే ముస్లిం అయిపోతాం అనుకుంటున్నారా! బాగా తెలుసుకోండి –

"అవిశ్వాసుల విషయంలో అల్లాహ్ నూహ్ మరియు లూత్ (ప్రవక్తల) భార్యల్ని ఉదాహరణగా పేర్కొంటున్నాడు. ఆ స్త్రీలిద్దరు పుణ్యాత్ములైన మా భక్తులిద్దరి దాంపత్యంలో ఉండేవారు. అయితే వారు తమ భర్తల పట్ల విశ్వాస ఘాతు కానికి పాల్పడ్డారు. అందువల్ల వారా స్త్రీలను (ప్రవక్తలై ఉండి కూడా) అల్లాహ్ (శిక్ష) నుండి ఏమాత్రం కాపాడలేకపోయారు. వారిద్దరితో (ఆ స్త్రీలిద్దరితో) "వెళ్ళండి, నరకాగ్నిలో పడేవారితో పాటు మీరూ అగ్నిలోకి పోయి పడండి" అని చెప్పడం జరిగింది. (దివ్య ఖుర్‌ఆన్– 66: 10)

telgo.indd 20 10/26/10 10:39 AM

- అబుల్ తాసన్

నేటి బాలలే రేపటి పౌరులు - 7

అ విశ్వాసులంతా ఒకరినొకరు తోసుకుంటూ, తొక్కుకుంటూ ఎటుపడితే అటు పారిపోతున్నారు. భూమి దద్దరిల్లేటట్లు గావుకేకలు పెడ్తున్నారు... ఆవ్మో! చచ్చానా బాబోయ్... రక్షించండి.... రక్షించండి.... వారిలోని ప్రతి ఒక్కరూ ఆ జల ప్రళయం నుండి బయట పడాలని శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు... అయినా ఆ జల ప్రళయం ఒక్కోసారి ఇద్దరిని, ముగ్గురిని తనలో జల సమాధి చేస్తుంటే... ఒక్కోసారి వందలాది, వేలాది మందిని తన విషకోరలు చాపి కాటేస్తూనే ఉంది... భయం... భయం.... నలు దిక్కులా దిక్కుచోచని స్థితి...కొండ లంతటి ఎత్తుకు ఎగిరే అలలు..!!

అటు జల ప్రళయం అవిశ్వాసుల మధ్య బీభత్సం సృష్టిస్తుంటే, ఇటు హజ్రత్ నూహ్ (అ) మరియు విశ్వాసులు సురక్షితంగా 'బిస్మిల్లా' అంటూ పడవలో ఎక్కారు. వారితో ధరిత్రిపై నివసించే ప్రతి జంతువు, పక్షి, మృగాల జంటలు అల్లాహ్ ఆనతితో తీసుకున్నారు. ఇప్పుడు ఆ పడవ జలప్రళయంలో ఓ పెద్ద కొండలా ప్రశాంతంగా తన గమ్యం వైపు సాగిపోతూ ఉంది. అంతలో హజ్రత్ నూహ్ (అ) గారి చూపు తన్ను వ్యతిరేకించిన తన సొంత కుమారునిపై పడింది. అతను అలల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. అది చూసి నూహ్ గారు చలించిపోయారు...

"ఓ కుమారా! ఇప్పటికైనా నేను చెప్పేది విను. రా... మాతోపాటు ఈ పడవలో ఎక్కు".

కాని కొడుకు నిరాకరించాడు. ఇలా అన్నాడు: "నాన్నా! నాటికీ, నేటకీ, మరెన్నటికీ మీ అవసరం నాకు లేదు. అదిగో... ఆ పెద్ద పర్వతం కన్పిస్తున్నదే.. దానిపై ఎక్కి కూర్చుంటా... ఈ జల ప్రళయం నన్నేం చేయలేదు. అక్కడి వరకు నీళ్ళు చేరలేవు". అయితే జల ప్రళయం ఆ పర్వతపు అత్యంత ఎత్తైన శిఖరాన్ని సయితం ముంచేసింది. అవిశ్వాసులంతా జల సమాధి అయ్యారు. విశ్వాసులంతా సురక్షితంగా బయట పడ్డారు. చివరకు ఆ పడవ "జూదీ" అనే పర్వతం పై వెళ్ళి ఆగింది...

కథ పూర్తయ్యాక-

"అబ్బాయిలూ! ఒక మాట వినండి, వలయంగానే కూర్చొని వినండి! రేపు అందరూ మీ గోళ్ళు తీయించుకుని రండి. మీకు చేతనైతే తీసుకోండి. చేతకాకపోతే మీ నాన్నతోనో, మీ అన్నతోనో, అక్కతోనో, అమ్మతోనో తీయించుకోండి" అన్నాడు అలీ.

"నేను గోళ్ళు పళ్ళతో కొరుక్కుంటా నండీ!" అన్నాడు ఒక పిల్లవాడు.

"అలా చేయకూడదు. గోరుగల్లు (నిల్ కటర్)తోనే గోళ్ళు తీసుకోవాలి" అన్నాడు అలీ.

మనం మరో తమాషా చేద్దాం అన్నాడు మళ్లీ.

అదేమిటి? అన్నారు అందరూ.

"మీరు మీ తల మీద టోపీలు తీసేసి మదర్సాకు రండి. ఈ మురికి బట్టిన టోపీలు లేకపోవడమే మంచిది".


అందరూ నవ్వారు. "అమ్మ బాబోయ్! టోపీలు లేకుండా మదర్సాకి రావడమే! టోపీలు లేకుండా రావడానికి మా అమ్మ నాన్న ఒప్పుకోరు".

సరే - టోపీలు ఉతుక్కొని, చొక్కా గుండీలు చక్కగా పెట్టుకొని రండి. ఇలా గుండీలు లేకుండా ఉండటం బాగా లేదు కదూ! ఇంకో విషయం సుమా! రేపు ఆదివారం. మనమంతా రహ్మాన్ భాయి గారి తోటలో పిక్‌నిక్‌కి వెళుతున్నాం. మీ అమ్మానాన్నలను ఒప్పించే పూచి నాది. దీనికి మీరంతా రెడియేనా..?

"అవును - భలే మంచిగుంటుంది" అని అందరూ లోలోన మురిసిపోతూ, ఆలోచించుకుంటూ ఇళ్ళకు వెళ్ళిపోయారు.

దారిలో అలీకి 'నఫ్సె అమ్మారా" ఎదురయింది - "ఏం బ్రదర్ అంతా తారుమారు చేసేస్తున్నావు. ఈ నటనంతా ఎందుకంటావు? గుండీలు కుట్టించుకోమనీ, గోళ్ళు తీయించుకోమనీ, ఇదనీ, అదనీ, ఎందుకు బాబు ఇదంతా? పిల్లల్లో ధార్మిక చైతన్యం తీసుకురావాలన్న గొప్ప ఆశయంతో వచ్చావు కదా! అదేదో నెరవేరిస్తే సరిపోదూ!? గోళ్ళూ, గుండీలూ తల్లిదండ్రులు చూసుకోవలసిన పని. అదేదో వాళ్ళే చూసుకుంటారు. వాళ్ళు చూసుకోకపోయినా నీకేమిటి నష్టం? ఆ శ్రమంతా మనకెందుకంటా "నఫ్సె లవ్వామా" కలగజేసుకుని ధార్మిక చైతన్యం అంటే ఇదే కదండి. మురికి దుస్తులతో, మొరటుగా ప్రవరిస్తూ ఉండే పిల్లల్లో తొలి దశలో తీసుకురావాల్సిన చైతన్యం శుచీశుభ్రతలు కాక మరేముంటుంది? ఈ లోపాలు వారి దృష్టికి తీసుకొనిరాగానే వారంతా ఎంతో సిగ్గు పడ్డారు. ఇలా మురికిగా ఉండటం బాగా ఉండదనే అభిప్రాయం వారికి కలిగింది. ఇక ముందు నుంచి చాలా మంది పిల్లలు పరిశుభ్రంగా ఉండటానికి ప్రయత్నం ప్రారంభిస్తారనే నమ్మకం నాకు కలిగింది అన్నది.

ఈ అంతర్గత సంఘర్షణలోనే ఇల్లు వచ్చేసింది. భోజనం చేసి తన డ్యూటీ మీద బయలుదేరాడు అలీ. అతను ఏం పని చేస్తాడని ఆలోచిస్తున్నారా! సిటీ సెంటర్‌లో అతనికి ఓ బట్టల షాపు ఉంది. అక్కడ సయితం అతను వచ్చే కస్టమర్స్‌కి ఏదో ఒక విధంగా ఇస్లాం గురించి తెలియజేస్తూనే ఉంటాడు. ఈ కార్యానికై అతను కొంత పైకం కూడా తన ఆదాయంలోంచి కేటాయించాడు. అవసరమైన క్యాసెట్లు, పాంప్లెట్లు పుస్తకాలు కొని తెచ్చి ఇస్తుంటాడు. ప్రతి రోజులానే ఈ రోజు కూడా అల్లాహ్ కృప వల్ల వ్యాపారం బాగానే జరిగింది. సాయంత్రం అయ్యింది. షాపును తన దగ్గర పని చేసే అబూ బకర్‌కి అప్పజెప్పి ఇంటికి చేరుకున్నాడు అలీ.



telgo.indd 21 10/26/10 10:39 AM

నెలవంక ఉత్తరాలు

గల్ఫ్‌లో ఇలాంటి పత్రిక లేదు

గౌరవనీయులైన **నెలవంక** ఎడిటర్ గారికి,

'నెలవంక' లాంటి విలువైన మాస పత్రికను ప్రచురించి, మాలాంటి సామాన్యుల వరకూ ఉచితంగా చేరవేస్తున్నందుకు ఐపిసికి నేను ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. ఒక విదేశంలో కార్మికులుగా ఉన్న మాకు, మా మాతృ భాషలో ధార్మిక పత్రిక అందటం చాలా గొప్ప విషయం.

ఈ పత్రికలో చాలా తక్కువ పేజీల్లో ఎక్కువ సమాచారాన్ని అందిస్తున్నారు. ఖుర్‌ఆన్ సూక్తులను, మహా ప్రవక్త (స) ఉపదేశాలను వినూత్న పద్ధతిలో తెలియజేస్తున్నారు. ఇస్లాంతో పాటు హైందవ క్రైస్తవ మతాలలో దైవ భావన గురించి, ప్రవక్త ఏసు క్రీస్తు గురించి వివరిస్తున్నారు. నాకు తెలిసినంతవరకు గల్ఫ్‌లో తెలుగు భాషలో ఇలాంటి పత్రిక లేదు. నెలవంక సంపాదక వర్గానికి నా కృతజ్ఞతలు.

– జి ముహమ్మద్ (కువైట్)

ఓ మనిషీ! దైవానికి భయపడు

దేవుడు మనిషిని బాధ్యత గల జీవిగా పుట్టించాడు. కాని మనిషి మాత్రం బాధ్యతా రహితుడుగా ప్రవర్తిస్తున్నాడు. దేవుడు మనిషిని తన ఆరాధన నిమిత్తం పుట్టించాడు. కాని మనిషి దేవుని ముందు సాష్టాంగపడే బదులు చాలా హీనమైన వస్తువులు, పశువుల ముందు తల పంచుతున్నాడు.

చెట్లు, చేమలు, పక్షులు, పువ్వులు తమకు తెలిసిన భాషలో తమ సృష్టికర్తను స్తుతిస్తుండగా మానవుడు మాత్రం తన సృష్టికర్తను స్మరించటం లేదు. ఒకవేళ నమాజు చేసినా ఎంతో నిర్లక్ష్యంగా అజాగ్రత్తగా చేస్తున్నాడు. ఒక పోలీసు అధికారి నుంచి పిలుపు వస్తే రెండు చేతులు కట్టుకుని, అతని ఎదుట బుద్ధిమంతునిలా నిలబడతాడు. ఆపాటి వినయం కూడా దైవసన్నిధిలో మనిషి కనబరచటం లేదు. నిజానికి మనిషనేవాడు భయపడవలసింది తనను సృష్టించిన దైవానికే. ఎందుకంటే అతను ఏదో ఒకనాడు సృష్టికర్త ఎదుట హాజరై, తాను చేసిన వాటికి సమాధానం ఇవ్వవలసి ఉంది.

అందుకే ఓ మనిషీ! నీకు లభించిన ప్రతి అవకాశాన్ని ఆఖరి అవకాశంగా భావించు. నీవు చేసే ప్రతి నమాజును చివరి నమాజ్ అనుకుని చేయి. అప్పుడే నీలో దైవభీతి జనిస్తుంది.

–ఎమ్.డి పీరాన్ (కువైట్)

వేళకు నమాజు చేయకపోతే వెలితిగా ఉంటోంది

అస్సలాము అలైకుమ్ రహ్మతుల్లాహి వ బరకాతుహు

నా పేరు ఫణిరాజ కుమారి. నేను బ్రతుకు తెరువు కోసం కువైట్‌కు వచ్చాను. పూర్వం మాది క్రైస్తవ మతం. అమ్మ నాన్న కూడా ఏసుక్రీస్తు దేవుడని చెప్పేవారు. నేను కూడా వారిలాగే ఏసు క్రీస్తు దేవుడని నమ్మేదాన్ని. కాని చర్చీకి వెళ్ళడం, ప్రార్థనలు చేయడం అంటే నాకు ఇష్టంగా ఉండేది కాదు. కువైట్‌కు వచ్చిన తరువాత నాకు కొన్ని పుస్తకాలు ఇచ్చినారు. చదివిన తర్వాత ఇస్లాం గురించి తెలుసు కున్నాను. అప్పుడు నాకు అన్పించింది – ఏసు క్రీస్తు ఒక ప్రవక్త (రసూల్) అని. ఇస్లాం నిజమైన రుజుమార్గము. హరామ్ అంటే ఏంటో, హలాల్ అంటే ఏంటో ముహమ్మద్ (స) వారి ప్రవచనాల ద్వారా తెలుసుకున్నాను.

అంధకారంలో పడివున్న నన్ను అల్లాహ్ కళ్ళు తెరిపించాడు. నేను ముస్లింను అయ్యాను. అల్‌హమ్దులిల్లాహ్. ఈమాన్ అని పేరు పెట్టుకున్నాను. ముస్లిం అయిన తర్వాత నాలో చాలా మార్పులు వచ్చాయి. నేను ముస్లిం అయి 7 సంవత్సరాలు అయ్యాయి. రోజుకు అయిదు సార్లు నమాజ్ చేస్తాను. నమాజు చేసుకోవడం కాస్త ఆలస్యం అయితే నా మనసుకు చాలా బాధ అన్పిస్తుంది. ప్రతి రోజు రాత్రి పడుకునే ముందు ఈ రోజు అన్ని నమాజులు చేసుకున్నానా లేదా అని మరీ మరీ గుర్తు చేసుకుంటాను. ఎందుకంటే ప్రళయం రోజున అల్లాహ్ దగ్గర నేను ప్రశ్నించబడతాను. అందుకు అల్లాహ్‌కు భయపడుతున్నాను. నాలా మరెందరో ఉన్నారు. వారికి సయితం అల్లాహ్ సన్మార్గ భాగ్యాన్ని ప్రసాదించాలని మనస్ఫూర్తిగా వేడుకుంటున్నాను. నన్ను ఇస్లాం మార్గములో నడిపించినందుకు అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకుం టున్నాను. (ఆమీన్)

– ఈమాన్ (కువైట్)

telgo.indd 22 10/26/10 10:39 AM



అంతిమ దైవ ప్రవక్త (స) ప్రవచించారు:
"మానవులపై ఒక కాలం రానున్నది. ఆ కాలంలో తన ధర్మం (ఇస్లాం)పై నిలకడ కలిగి ఉండేవాని ఉపమానం తన చేతిలో నిప్పు తునకను పట్టుకున్న వ్యక్తి లాంటిది". (తిర్మిజీ)

- నేడు మానవత కాలం వేసే కళ్ళెంలో ఇరుక్కుంది. పరిస్థితుల ఇంద్రజాలానికి మోసపోయింది. ఇంటర్‌నెట్ ఉచ్చులో నవతరం దారుణంగా చిక్కుకుపోయింది.
- మితిమీరిన ఉదారవాదం (permissiveness) నేటి మానవ సముదాయాలను నిలువునా ముంచేస్తుంది.
  స్త్రీపురుషులు సహజీవనం సాగించటానికి పెళ్ళి పెటాకులెందుకట? అని వెటకారం చేస్తున్నారు. 'గే' కల్చర్‌కి పర్మిట్ ఇస్తే తప్పేమిటి? అని వ్యంగ్య బాణాలు సంధిస్తున్నారు. సిగ్గు విడిచి మరీ ప్రవర్తిస్తున్నారు.
- మత్తు పదార్థాలకు బానిసై మైమరచి పోతున్నారు. పబ్ కల్చర్‌కు అలవాటుపడి నైతిక విలువల వలువలు వలిచేస్తున్నారు.
- విచ్చలవిడితనం, లైంగిక విశృంఖలత్వాల దుష్ఫలితాలను మనుషులు ఇప్పటికే చవిచూస్తూ జీవచ్ఛవాల్లా బ్రతుకు వెళ్లదీస్తున్నారు.

ఇలాంటి కఠిన పరీక్షా కాలంలో నీతికి నిలబడి, ధర్మబద్ధమైన జీవన విధానానికి కట్టుబడి జీవించడం అరచేతిలో నిప్పు కణికను పట్టుకోవడంతో సమానమే. కానీ ఇలాంటి క్లిష్టతర పరిస్థితుల్లోనూ సహనం, స్థయిర్యం, నిగ్రహం గల వారు నిజంగా ధన్యులు. ఇలాంటివారికే ప్రవక్త మహనీయులు (స) శుభవార్తను అందజేశారు. – "ప్రళయ దినాన నీడ ఎక్కడా కానరాని మాడ్చివేసే ఎండలో శీలవంతులైన యువకులకు అల్లాహ్ అర్ష్ నీడ లభిస్తుందని, వారు అనుగ్రహభరితమైన స్వర్గ వనాలలో ప్రవేశిస్తార"ని.



మీ వాణిజ్య ప్రకటనలను స్వాగతిస్తోంది. అధర్మమైన, అసభ్యకరమైన, అశ్లీలంతో కూడిన విషయాలు తప్ప మిగిలిన ప్రకటనలన్నీ వేయబడతాయి.

	Description	Advertisement Rate	30% Discount for One year	20% Discount for one Month
1	Inside Page of Front Cover	KWD 150	KWD 105	KWD 120
2	Inside Page of Back Cover	KWD 150	KWD 105	KWD 120
3	Single Page Inside	KWD 100	KWD 70	KWD 80
4	Two middle pages	KWD 200	KWD 140	KWD 160
5	Back Cover Page	KWD 200	KWD 140	KWD 160

Half Page : Half of the above mentioned rates ❖ Quarter Page : Quarter of the above mentioned rates

contact: abdussalamsyed@ymail.com, Tel.No: 97248933

telgo.indd 24 10/26/10 10:39 AM